KN 39295
కథా నిలయం
శ్రీకాకుళం

హ్యాపీ బర్త్‌డే

2009 మే 10 నుంచి
2009 మే 16 వరకు

ఎస్.కె. షరీఫ్
7సం॥, మే-2002
షబానా-యూసఫ్
బండలేమూర్-రంగారెడ్డి

సిహెచ్. రేణుక
7సం॥, మే-14
లలిత-శ్రీనివాసరావు
ఏలూరు-ప॥గో॥

ఎస్. సమరసింహారెడ్డి
7సం॥, మే-16
నీలిమారెడ్డి-భీమార్జున్‌రెడ్డి
విద్యానగర్-నల్లగొండ

ఎ. రూపశ్రీ
5సం॥ మే-12
ధనలక్ష్మి-శ్రీరాములు
మధిర-ఖమ్మం

డి. సాయి వెంకట అనిరుధ్
10సం॥,మే-1999
సంగీత-నరేందర్
ఇల్లందు-ఖమ్మం

జి. గణేష్
10సం॥, మే-9
రాణి-రెడ్డయ్య
ప్రకాశ్‌నగర్-కడప

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి
ప్లాట్ నెం. 21/1, ఎం.హెచ్ భవన్
ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగం పల్లి,
హైదరాబాద్-500 020

మనలో మాట

కలల కాలమ్!



కలలు కనటం ఒక ప్రాయానికే పరిమితమని అనుకొంటున్నారా? శుద్ధ తప్పు. అసలే కలల కాలమిది! కలల్లో విహరించడం, ఊహల్లో ఊరేగడం ప్రేమికుల వ్యాపకమే కాదండోయ్. కొందరివి రాత్రి కలలు... కొందరివి పగటి కలలు. రాత్రి కలలు మన చేతుల్లో లేవు. అవి ఎందుకొస్తాయో తెలియదు. వచ్చినవి జ్ఞాపకం వుండి చావవు కూడా. పగటి కలలు అలా కాదు. ఆలోకంలోకి వెళ్లడానికి పాస్‌పోర్టులు, వీసాలు గట్రా అక్కర్లేదు. అదుపూ, ఆంక్షలూ లేకుండా కనొచ్చు. కన్న కలల్ని గట్టిగా నమ్మి కూర్చుంటేనే ప్రమాదం. కలలు కనే కార్యక్రమానికి మాజీ రాష్ట్రపతి ఒకరు 'రాజముద్ర' వేశారు కూడా. దరిమిలా ఇప్పుడు కూర్చొని కలలు కనడం ఓ గొప్ప విజన్ కింద లెక్క. ఇప్పుడు *'కల కను.. నిజం చేసుకో...'* అన్నది- *'ఇడ్లీ తిను... ఈల వేసుకో..'* అన్నంత ఈజీ అయిపోయింది!

నేటి వినియోగ ప్రపంచంలో కలలు కనడంలో ప్రేమికులు అందరికన్నా ముందు సీట్లో ఉంటారనుకుంటే పొరపాటు. అబ్బో ఈ విషయంలో రాజకీయ నాయకులను మించిన 'కలా'కారులు లేనేలేరు. కలలతో వాళ్ల కర్తవ్యం మొదలవుతుంది. *అల లేని సముద్రం, కల కనని కార్యం ఉండవనేది* వాళ్ల అనుభవం. అందుకనే - *ఆలూ లేదు చూలూ లేదు కొడుకు పేరు సోమలింగమట!* అన్న వెటకారాలకు ఇప్పుడు ఎవరూ వెరవడం లేదు. ముఖ్యమంత్రి పీఠం నాదంటే నాదని ముఖ్య నాయకులంతా పనిగట్టుకొని పగటి కలలు కంటున్నారు. తమ అనుచరులనూ కలలు కనమని చెప్తున్నారు. కొందరు ఇంకా ముందుకెళ్లి ముహూర్తాలూ సన్నాహాలూ సిద్ధం చేసుకుంటున్నారట. కలలను కంట్రోలు చేయడం ఎన్నికల కమిషన్‌కు సాధ్యమయ్యే పని కాదు. కాబట్టి- *'కల కను.. కుర్చీ కొను'* అన్న పాలసీతో వాళ్ల స్వప్న విహారం నిర్విఘ్నంగా సాగుతోంది!

రాష్ట్ర స్థాయి పెద్దలు పెద్ద కుర్చీ కోసం కలలు కంటుంటే- జిల్లాల్లోని పెద్దలు మంత్రి కొలువుకోసం మల్లగుల్లాలు పడుతున్నారు. *అటు దూకితే ఏ పదవి? ఇటు మారితే ఏ పైరవీ?* అని డ్రీమ్‌సాంగ్స్ పాడుకుంటున్నారు. మంత్రి గిరికి పోటీ పడే తోటి పెద్దలు ఓడిపోవాలని ఎవరికి వారే వెంకన్నలాంటి దేవుళ్లకు మొక్కుల ఎర వేస్తున్నారు. తమాషాకు తత్ స్వామి- అందరి కోరికలకూ *'తథాస్తు'* అంటే- కుర్చీ కలలు కనే నాయకులందరికీ బోడిగుళ్లే మిగులుతాయ్! బహు సుందర దృశ్యం కదూ?

సామెత : ఇల్లలకగానే పండగ కాదు.

తిరగమోత : కల కనగానే పదవి రాదు.

★

కథా నిలయం శ్రీకాకుళం

ఈ సంచికలో....

టప్పా	...	2
రుచి	...	3
స్ఫూర్తి	...	4
సీరియల్	...	6
కథ	...	8
బాల నేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
చూద్దామా	...	18
క్రైమ్‌కథ	...	20
తెల్సా	...	21

ఇంకా...

కవిత్వమ్ ... 10

అమ్మా... ఓనా మమ్మీ

ఆరోగ్యం ... 11

30 రోజుల్లో

అలర్జీ-ఆస్తమా గుర్తించడం ఎలా?



కూల్‌కూల్‌గా ... 22

వేసవి తాపం తగ్గించే సహజ రసాలు

కొత్త పుస్తకాలు ... 24

తెల్లోడిపై తొలిపోరు



మహా రుచులు

తోటకూర పులుసుకూర, పచ్చిపులుసు, మజ్జిగ పులుసు, పెరుగుగారె భలే బాగున్నాయి. చీమల పుట్టలే ఆఫ్రికాలో కొండలంత పెద్దగా ఉన్నాయంటే ఆశ్చర్యంగా వుంది. కవర్‌స్టోరీ 'మంత్రాలయ్' అవసరాలు, తీరుతెన్నుల వ్యాసం బాగుంది. లక్నో వైభవాలు మురిపించాయి. నేటికీ ముష్కరుల పాల పడకుండా పదిలంగా ఉండటం ఆశ్చర్యమే మరి. నేడు ఓటర్లకు చిద్విలాసం, ప్రజాప్రతినిధులకు కంటతడి సబబే మరి.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

సెక్రటేరియట్ వివరాలు చక్కగా ఇచ్చారు

అట్టమీదికథ 'మంత్రాలయ్'లో మణి అందించిన సచివాలయం గురించిన రచన, దాని స్వరూప స్వభావాన్ని ప్రతిబింబించింది. లావాటి మల్లుడు అంశం అబ్బురపరిచింది. ఉష అందించిన కథ నీటిలో చేపలు బావుంది. తెల్సా శీర్షికని మేమెంతో అభిమానిస్తాం. ఆరోగ్యంలో చెప్పిన విషయాలు చదివాక గ్యాస్ ట్రబుల్ గురించి ఒక అవగాహన కలిగింది. వచ్చేవారం సంచికలో మరిన్ని వివరాల కోసం ఎదురు చూస్తున్నాం. నిజమే 'మనలోమాట'లో చెప్పినట్లు ఎన్నికల రిజల్ట్స్ కోసం నేతలకున్న టెన్షన్ ఓటేసిన సామాన్యుడికి ఉండనే ఉండదు. బాల నేస్తాలులో 'చేద్దామా' అంశం పేపర్‌వీల్ అందించడం బావుంది. ప్రాచీనతా నవీనతా కలబోత లక్నో పరిసర ప్రాంతాలను 'చూద్దామా'లో చూడగలిగాం. మధురఫలం ద్రాక్ష గురించి ఇచ్చిన వివరణలో కొనేటప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలు తెలియజేసి ఎంతో మేలు చేశారు.

నేమాన సుభాష్ చంద్రబోస్, ఇలిసిపురం, శ్రీకాకుళం.

సీరియల్ బావుంటోంది

ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో వస్తున్న కె.చిన్నప్ప భారతిగారి సీరియల్ 'గని' చాలా బాగుంది. పని పరిస్థితులు, కార్మికుల కష్టాలు, కష్టాలలో ఉన్న శ్రమజీవుల పట్ల కరుణలేని యజమానులు, దయనీయ పరిస్థితులు చదువుతుంటే హృదయాన్ని గట్టిగా పట్టుకుని పిండినట్లుగా ఉంది. వాళ్లకు స్వాతంత్ర్యం లేదు. హక్కుల్ని అడిగే అవగాహన పెరగలేదు. అణచివేతకు గురవుతున్నారు. కార్మికులపై తప్పుడు అభియోగాలు బనాయించి చిత్రవధ చేయడమో, లేక చంపేయడమో జరుగుతుంది. అటువంటి ఘాతుకాల్ని వాళ్లు సహించగలిగారంటే చదువుతుంటే కన్నీళ్లు వస్తున్నాయి. మనసులో బలం వస్తోంది. కార్మికశక్తి దాస్తే దాగనిది. ఎంత అణచివేస్తే అంత తిరగబడుతుంది. 'గని' ఉత్తమ సీరియల్. దీన్ని అందరూ చదివితే బాగుంటుంది.

పరుచూరు రాకేష్, మనోహర్, మంగళగిరి.

క్రైమ్ + కామెడీ కావాలి

ఈవారం ఆదివారం అనుబంధంలో కవితలు బాగున్నాయి. గని సీరియల్, నీటిలో చేపలు కథ, మేకవన్నె పులి క్రైమ్‌కథ ఆకర్షణీయంగా ఉన్నాయి. స్నేహలో పేజీలు కొంచెం పెంచి జోక్స్, కార్టూన్స్, గళ్ల నుడికట్టు మొదలైనవి ఇవ్వవచ్చు. అలాగే ప్రతీ వారం ఒక క్రైమ్ స్టోరీ, ఒక కామెడీ కథ కూడా ఇస్తే బావుంటుందని నా అభిప్రాయం. మిగతా శీర్షికలు బాగున్నాయి.

అత్తివిల్లి బాలసుబ్రహ్మణ్యం, ఖైరతాబాద్.

మరింత వివరిస్తే బావుండేది

ఏప్రిల్ 19 ఆదివారం సంచికలో చూద్దామా శీర్షికలో 'మందిరాలవనం వారణాసి' వ్యాసం చాలా బాగుంది. స్నాన ఘట్టాలు, తులసీమందిర్, సంకట్ నివారణ్, కాలభైరవ ఆలయం మొదలైనవన్నీ చిత్రాలతో సహా వివరించారు. కాశీ అన్నపూర్ణేశ్వరి, విశాలాక్షి దేవాలయాల చిత్రాలు కూడా ప్రచురిస్తే బాగుండేది. భారతదేశానికి మకుటాయమానమైన కాశీ విశ్వవిద్యాలయం, బిర్లా కాశీ విశ్వేశ్వరాలయం గురించి చిత్రాలతో వ్యాసకర్త విపులీకరించి రాస్తే బాగుండేది.

ఆచార్య నూతి నారాయణరావు, హైదరాబాదు.

పిల్లలకోసం ఏదైనా...

ప్రస్తుతం పిల్లలకోసం ఇస్తున్న కథలు, పజిల్స్, బాలనేస్తాలు, హ్యాపీ



బర్త్‌డే ... బావుంటున్నాయి. కానీ ఇంకా ఏదైనా కొత్తగా, ఆకర్షణీయంగా ఇస్తే బావుంటుందనిపిస్తోంది. ఈమధ్యే మొదలెట్టిన బీర్బల్ కథలు బావుంటున్నాయి. కానీ ఇంకా ఏదైనా కొత్తగా ఆలోచించొచ్చుకదా. అలాగే సీరియల్ బావుంటోంది. బొమ్మలు కొంచెం ఆకట్టుకునేలా ఇస్తే బావుంటుందేమో. అనువాద నవల అయినా తెలుగులో రాసినట్టే బావుంటోంది. ఈ వారం ఇచ్చిన తెల్సా బిట్లు బావున్నాయి.

అనురాగ్ కుమార్, ఇంకొల్లు.

పులుసులు సూపర్

మజ్జిగ పులుసు, తోటకూర పులుసు, పచ్చి పులుసు, పెరుగు గారె బావున్నాయి. చదవగానే చేసి రుచి చూడాలనిపించింది. వేసవి తాపాన్ని తట్టుకోవడానికే వీటిని ఇచ్చారనుకున్నాం.

మాధవి, వైజాగ్.

కథలకు ఆహ్వానం

మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతుంటాయి. వీటిలో ఎన్నో సంఘటనలు మనసును మెలిపెడుతుంటాయి. అవి సామాజికమైనవి కావచ్చు, ఆర్థికమైనవి కావచ్చు, మరేవైనా కావచ్చు. వాటిని ప్రతిబింబించే... బాధితులను చైతన్యపరిచే... సామాజిక స్పృహ కలిగించే... కథలను మాకు పంపండి. ప్రచురిస్తాం. ఆకర్షణీయమైన పారితోషికం వుంటుంది. అయితే తెల్లకాగితం మీద ఒకవైపు మాత్రమే రాయాలి. రాతలో ఏడు కాగితాలకు మించకూడదని మనవి.

మా చిరునామా:
కథ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.

కథా నిలయం
శ్రీకాకుళం



మామిడికాయ మురబ్బ

కావలసిన పదార్థాలు

కొబ్బరి మామిడికాయ తురుము : 1 కప్పు
నెయ్యి : తగినంత, జీడిపప్పు: 10
బాదంపప్పు : 10, కిస్‌మిస్ : 10
పంచదార : 1 కప్పు, యాలకలు: 2

తయారుచేసే విధానం

పొయ్యిమీద బాండీ పెట్టి కొద్దిగా నెయ్యివేసి జీడిపప్పు, కిస్‌మిస్ వేయించి పక్కన పెట్టుకోవాలి. బాండీలో ఇంకా కొంచెం నెయ్యి వేసి అందులో మామిడి తురుము వేసి దాన్ని మెత్తగా మగ్గనివ్వాలి. అందులో పంచదార వేసుకొని మరికొద్దిసేపు ఉంచాలి. ఇది బాగా దగ్గరపడ్డాక పైన వేయించి పెట్టుకున్న జీడిపప్పు, కిస్‌మిస్, బాదంపప్పు వేసి సర్వ్ చేసుకోవాలి. కావాలనుకుంటే యాలకల పొడి కూడా వేసుకోవచ్చు. ఆ వాసన నచ్చినవాళ్లకు అది ఇంకా బాగుంటుంది.



మామిడికాయ పులిహోర

కావలసిన పదార్థాలు

మామిడికాయ తురుము : ఒక కప్పు, బియ్యం : 2 కప్పులు
తాలింపు సామాను : రెండు టేబుల్ స్పూన్లు
కరివేపాకు, కొత్తిమీర : తగినంత
నూనె తగినంత, పసుపు : తగినంత

తయారుచేసే విధానం

బియ్యాన్ని కడిగి తగినంత ఎసరపోసి అన్నం వండుకోవాలి. దాన్ని ఒక వెడల్పాటి పళ్లెంలోకి తీసుకోవాలి. పొయ్యి మీద బాండీ పెట్టి అందులో సరిపడా నూనె, తాలింపు దినుసులు వేసి వేగనివ్వాలి. అందులో కర్వేపాకు, కొత్తిమీర కూడా వేసుకోవాలి. పసుపు కూడా వేయాలి. దించే ముందు మామిడి తురుము, ఉప్పు వేసి రెండునిమిషాలు పొయ్యిమీద ఉంచి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని వేసి అన్నం బాగా కలపాలి. అంతే మామిడికాయ పులిహోర తయార్. ఇష్టమైన వారు వేరుశనగ పప్పులను కూడా నూనెలో వేయించుకొని కలుపుకోవచ్చు.



మామిడికాయ పప్పు

కావలసిన పదార్థాలు

మామిడికాయ : ఒకటి (చిన్నది), పప్పు : కప్పున్నర
ఉల్లిపాయ : ఒకటి (చిన్నది), పచ్చిమిర్చి : రెండు
వెల్లుల్లి : 4 రెబ్బలు, కరివేపాకు : 1 రెమ్మ
తాలింపు సామాను : రెండు టేబుల్ స్పూన్లు
ఉప్పు : తగినంత, కారం : తగినంత
పసుపు : చిటికెడు, నూనె : తాలింపుకు
ఎండుమిర్చి : ఒకటి, కొత్తిమీర : 1 కట్ట (చిన్నది)

తయారుచేసే విధానం

మామిడికాయను చెక్కుతీసి ముక్కలుగా కోసుకోవాలి. ముందుగా పప్పును ఉడకపెట్టుకోవాలి. మామిడికాయ ముక్కల్ని ఉప్పు, కారం, ఉల్లిపాయముక్కలు కొద్దిగా, పచ్చిమిర్చి వేసి విడిగా ఉడకపెట్టుకోవాలి. పప్పులో ఈ మిశ్రమాన్ని వేసి గరిటెతో కలుపుకోవాలి. పొయ్యిమీద కళాయి పెట్టి నూనెవేసి పైన చెప్పిన ఎండుమిర్చి, ఆవాలు, జీలకర్ర, మినపప్పు, శనగపప్పు, వెల్లుల్లి, కరివేపాకు, కొత్తిమీర వేసి తాలింపు పెట్టుకోవాలి. అంతే మామిడికాయ పప్పు తయార్.. ఇష్టమైన వాళ్లు తాలింపులో ఇంగువ కూడా వేసుకోవచ్చు.

మామిడి చిన్నముక్కల పచ్చడి

కావలసిన పదార్థాలు

మామిడికాయలు : రెండు, ఎండిమిర్చి : 10కాయలు
మినపప్పు : 1 టేబుల్ స్పూన్, మెంతులు : 1 టేబుల్ స్పూన్
ఉప్పు : తగినంత, నూనె : తగినంత

తయారుచేసే విధానం

మామిడికాయలను చెక్కుతీసి చిన్నముక్కలుగా కోసుకోవాలి. పొయ్యిమీద కళాయి పెట్టి కొద్దిగా నూనె వేసి మినపప్పు, మెంతులు, ఎండిమిర్చి వేసి కొద్దిగా వేపుకోవాలి. ఇవి చల్లారాక ఉప్పు చేర్చి మిక్సీలో వేసుకోవాలి. మరీ మెత్తగా కాకుండా బరకగా వేసుకోవాలి. తరిగిపెట్టుకున్న మామిడిముక్కల్లో ఈ పొడి వేసి నూనె పోస్తూ కలుపుకోవాలి. నూనె మనకు కావాల్సినంత వేసుకుంటే సరిపోతుంది. ఇది అప్పటికప్పుడు వేసుకొని తినొచ్చు. రెండోరోజుకైతే ఇంకా బాగుంటుంది.



- శాంతిశ్రీ

స్ఫూర్తి

త్యాగమూర్తులే మార్గదర్శులు

- వి. కృష్ణయ్య
ప్రజాశక్తి జనరల్ మేనేజర్,
సిపిఐ(ఎం) కార్యదర్శి వర్గ సభ్యులు



మన చుట్టూ కూడా చాలా ప్రభావాలు పనిచేస్తుంటాయి. చదువులో వెనక పడ్డామనో, ఆర్థికంగా ఎదగలేకపోయామనో, అనుకున్న స్థానం దక్కలేదనో నిరాశపరచేందుకు ప్రయత్నాలూ జరుగుతాయి. మనం ఏమాత్రం వాటి ప్రభావాలకు గురికాకుండా ఉద్యమానికి మనం ఎలా పనికొస్తామో అలా మనల్ని మనం మల్చుకొని ముందుకు సాగాలి. అలాంటి కార్యకర్తలను ఎంత ఎక్కువమందిని తయారుచేసుకోగలిగితే పార్టీని అంత ముందుకు తీసుకుపోవచ్చు. పైగా సొసైటీలో పలు ఆకర్షణలు వుంటాయి. డబ్బు సంపాదిస్తే బాగా బతకొచ్చుకదా అనేది సాధారణ ఆకర్షణ. ఇలాంటివాటిని దరి చేరనివ్వకుండా త్యాగంతో కూడుకున్న జీవితాన్ని గడపాలని 'కాకలు తీరిన యోధుడు' చెప్తుంది. దేనికైనా సిద్ధపడిన త్యాగమయ జీవితం మహత్తర ఉద్యమానికి ఉపయోగపడుతుంది. అప్పుడు మాత్రమే ఆ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లగలుగుతాం.



'మీకు స్ఫూర్తినిచ్చిన పుస్తకం గురించి రాసివ్వండి' అని మిత్రులు అడిగినప్పుడు... నేను చదివిన పుస్తకాలన్నీ ఒక్కొక్కటిగా మదిలో మెదిలాయి. వాటిలోంచి ఒక పుస్తకాన్ని ఎంచుకోవడం కష్టమేననిపించింది. అదేసమయంలో నాకు పుస్తకపఠనం పట్ల ఆసక్తిని రేకెత్తించిన ఉపాధ్యాయులూ గుర్తొచ్చారు. మాది ప్రకాశం జిల్లా ఇంకొల్లు మండలం గంగవరం గ్రామం. ఒలేటి కృష్ణయ్య హైస్కూల్లో చదువుకున్నాను. అది మా తాతగారు కట్టించిందే. అక్కడి ఉపాధ్యాయులు ఎక్కువమంది కమ్యూనిస్టులు. అభిమానులు. దేశం కోసం, స్వేచ్ఛ స్వతంత్ర్యాలకోసం, విముక్తికోసం ప్రాణత్యాగం చేసిన వీరుల గురించి, వియత్నాం వంటి పోరాటాల గురించి మాకు చెప్పేవారు. అలాంటి పుస్తకాలు చదవమని ప్రోత్సహించేవారు. వాటి నుంచి పొందిన ప్రోత్సాహం, స్ఫూర్తితోనే మేం ఎస్ఎఫ్ఐలోకి వచ్చాం. ఇంజనీరింగ్ కాలేజీలో పోరాటాలు చేసినా ఆ స్ఫూర్తితోనే. మొదటినుంచీ సోవియట్ సాహిత్యం బాగా చదివేవాణ్ణి. బీళ్లు దున్నారు, రష్యాలో అంతర్గత యుద్ధం గురించి ఇలా. సోవియట్ ప్రణాళిక గురించి సోవియట్ గురించి, లెనిన్ నూతన ఆర్థిక విధానం, ప్రణాళికలు, సోవియట్‌లో విద్య, విద్యారంగం ఎలా వుండేది? వంటివి ఎన్నో చదివాను. వాటన్నిట్లో నికొలాయ్ ఓస్ట్రోవ్‌స్కీ రచించిన 'కాకలు తీరిన యోధుడు' గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. అది నా చేతికి చేరిన క్షణాలను ఇప్పటికీ మరువలేను.

అది 1987వ సంవత్సరం. అసెంబ్లీ ఎన్నికలు జరిగే రోజులు. బోడేపూడి వెంకటేశ్వరరావుగారు బరిలో వున్నారు. మధిరలో పగలంతా ఎన్నికల ప్రచారం చేసేవాళ్లం. రాత్రుళ్లు లైబ్రరీలో పుస్తకాలు తిరగేసేవాళ్లం. సరిగ్గా అప్పుడు 'కాకలు తీరిన యోధుడు' నవల నా చేతికి వచ్చింది. చదవడం మొదలెట్టిన దగ్గరనుంచీ తర్వాత ఏం జరుగుతుందోనని ఒకటే ఉత్కంఠ. పూర్తి కావడానికి ఏడు రోజులు పట్టింది. ఇప్పటి వరకు ఇన్ని పుస్తకాలు చదివినా నాలో స్ఫూర్తినింపిన పుస్తకమది. ఇప్పుడు మళ్లీ ఇన్ని రోజుల తర్వాత ఎన్నికలకోసం పని చేస్తూ ఆ నవల గురించి రాయాల్సి రావడం కాకతాళీయమే అయినా మూడు విషయాలు చెప్పుకోవాలి. పార్టీ ఏ పని చెప్పినా ఎక్కడికి పంపినా మనస్ఫూర్తిగా పూర్తిస్థాయిలో పనిచేయాలన్నది మొదటి విషయం. పెద్దగా చదువుకోకపోయినా పేదరికం నుంచి, పీడన నుంచి విముక్తి పొందాలంటే పోరాటమే మార్గమన్నది రెండవ విషయం. నవలలోని కథానాయకుడు చదువుకుంది తక్కువే. అయితేనేం తన చుట్టూవున్న వారి జీవితాలను, అందులోని సాదకబాధలను నిత్యం అధ్యయనం చేశాడు. వారి మంచి కోసమే పాటుపడ్డాడు. ఈ తరహా నిరంతర అధ్యయనమనేది మనకు కూడా ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆ అధ్యయనమే ఒక సాధారణ కార్యకర్తను సైతం నాయకుడిగా మారుస్తుందన్నది మూడవ విషయం.

నవలలోని కథానాయకుడు పావెల్ కోర్చాగిన్ అందుకు నిలువెత్తు నిదర్శనం. ఇతను తన పన్నెండవ ఏట రైల్వే హోటల్‌లో పనికి కుదురుతాడు. తల్లి ఓ అధికారి ఇంట్లో వంటపని చేసేది. అన్న రైల్వేస్టేషన్‌లో పని చేసేవాడు. గర్భదరిద్రమూ, కఠినపీడనా మధ్య ఆయన బాల్యం గడిచి, వర్గశత్రువులపట్ల పరమ ద్వేషాన్ని రగిలిస్తుంది. సాంఘిక అన్యాయాలు, మానవుని అవమానాల పట్ల తీవ్ర వ్యతిరేకతను మేల్కొల్పుతుంది. హోటల్‌లో జరిగే అన్యాయాలు, మోసాలు చూడలేక ఆయన అక్కడే రైల్వేకర్మాగారంలో మెకానిక్‌గా పనిచేస్తున్న అన్నగారివద్దనే తీరుబడి సమయం అంతా గడిపేవాడు. అతని ప్రశ్నించే, ఎదురుతిరిగే స్వభావాన్ని గమనించిన టీచర్ (క్రిస్టియన్ ఫాదర్) స్కూలు నుంచి బహిష్కరిస్తాడు. అక్కడే మానవహక్కుల కోసం కార్మికులు పోరాడాలనే విషయం నేర్చుకుంటాడు. బోల్షివిక్కులు చెప్తూంటే లెనిన్‌ను గురించీ, ఆయన అభిప్రాయాల్ని గురించీ వింటాడు. యుక్రెయిన్‌లో అంతర్యుద్ధం మహాభయంకరంగా నడిచే రోజులవి. రష్యాలో ప్రారంభమైన కార్మిక విప్లవమూ, పశ్చిమ దిశనుండి వస్తున్న సామ్రాజ్యవాద ప్రతి విప్లవమూ అక్కడే ఘర్షించేయి. ఇదే యుక్రేనియన్ యువజనుల్ని వర్గపోరాటాల వైపు ఆకర్షిస్తుంది. ద్రోహం చేసి యుద్ధరంగంలో జర్మన్లకు దారి ఇచ్చేసిన యుక్రేనియన్ బూర్జువాజీతోనూ, విదేశీ దురాక్రమణదారులతోనూ పోరాడుతున్న రహస్య విప్లవ కమిటీకి పావెల్, అతని మిత్రులూ సాయపడేవారు. ఆ తర్వాతే ఎర్రసేనలో చేరతాడు. మంచి సాహసిగా పేరుపొందుతాడు. పోలీష్ (తెల్ల) సేనలతో యుద్ధాలలో పేరుపడ్డ మొదటి

గుర్రపుసైన్యంతో కలిసి పనిచేసేనాటికికాతని వయస్సు పదిహేనేళ్ళు. ల్వోవ్ వద్ద జరిగిన యుద్ధంలో గాయపడతాడు. కుడికన్ను పోతుంది. రెండునెలలపాటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న తర్వాత ఇంటికి చేరతాడు. 1921లో ఆతడు కీవ్ వెళతాడు. అక్కడ 'కామ్‌సోమాల్' నిర్మాణానికి నాయకత్వం వహిస్తాడు. కాని ఆ శ్రమతో అతని ఆరోగ్యం చెడిపోతుంది. ఇంకా కామ్‌సోమాల్‌లోని కామ్రేడ్స్‌తో కలిసి కలప తెప్పలు వరదల్లో కొట్టుకుపోకుండా గట్టుకు లాగడానికి వెళతాడు. డ్నీపర్ నదినీటిలో మోకాలి లోతున నిలబడి అతడా పని ముగిసేవరకూ కష్టపడతాడు. యుద్ధంలో తగిలిన గాయం, టైఫస్ జ్వరం, బహుతీవ్రంగా వచ్చిన కీళ్ల నొప్పులవ్యాధి వలన అతడు కీవ్‌లో పని మానుకోవలసినంత బలహీనస్థితికి తెస్తాయి. కాని, దేశరాజకీయ జీవితానికీ, నిర్మాణాత్మక కృషికీ దూరం కావడం అతనికిష్టంలేదు. ఏదో ఒకపని చేస్తానంటాడు. చివరకు ఆయన పట్టుదల మీదనే పశ్చిమ సరిహద్దులోని యూక్రేనియన్ నగరం బెరెజ్డోవ్‌కు పంపుతారు. అక్కడ పార్టీ, కామ్‌సోమాల్ కార్యక్రమాలలో చాలా గట్టిగా పని చేస్తాడు.

మన చుట్టూ కూడా చాలా ప్రభావాలు పనిచేస్తుంటాయి. చదువులో వెనక పడ్డామనో, ఆర్థికంగా ఎదగలేకపోయామనో, అనుకున్న స్థానం దక్కలేదనో నిరాశపరచేందుకు ప్రయత్నాలూ జరుగుతాయి. మనం ఏమాత్రం వాటి ప్రభావాలకు గురికాకుండా ఉద్యమానికి మనం ఎలా పనికొస్తామో అలా మనల్ని మనం మల్చుకొని ముందుకు సాగాలి. అలాంటి కార్యకర్తలను ఎంత ఎక్కువమందిని తయారుచేసుకోగలిగితే పార్టీని అంత ముందుకు తీసుకుపోవచ్చు. పైగా సొసైటీలో పలు ఆకర్షణలు వుంటాయి. డబ్బు సంపాదిస్తే బాగా బతకొచ్చుకదా అనేది సాధారణ ఆకర్షణ. ఇలాంటివాటిని దరి చేరనివ్వకుండా త్యాగంతో కూడుకున్న జీవితాన్ని గడపాలని 'కాకలు తీరిన యోధుడు' చెప్తుంది. దేనికైనా సిద్ధపడిన త్యాగమయ జీవితం మహత్తర ఉద్యమానికి ఉపయోగపడుతుంది. అప్పుడు మాత్రమే ఆ ఉద్యమాన్ని ముందకు తీసుకెళ్లగలుగుతాం

పావెల్‌కు ఆతర్వాత పనేమీ చెయ్యలేనంతటి అనారోగ్యం వచ్చేస్తుంది. ప్రత్యేక నిపుణులు మందులిస్తారు. శానిటోరియంలో ఎంతో కాలం చికిత్స చేస్తారు. కాని, రోగం తగ్గదు. పైగా ఎక్కువౌతుంది. ఈ వీరయువకుడు జీవితాంతం వరకూ మంచంమీద గడపవలసినవాడేనని 1926 ఆఖరుకు స్పష్టం అవుతుంది. మరోమూడేళ్ళకి పూర్తిగా గుడ్డితనం వచ్చేస్తుంది. 1930లో కీళ్ళన్నీ పూర్తిగా బిగిసిపోతాయి. ఒక్క చేతులు... మోచేతుల వరకు మాత్రమే స్వాధీనంలో ఉంటాయి. ఆస్థితిలోకూడా పార్టీ సభ్యులలో ఒకడిగా మెలిగే అవకాశం కోల్పోతానన్న ఆలోచనే అతనిని విపరీతంగా బాధపెడ్తుంది. అతను జీవితంలో కోరుకున్నదొకటే. యుద్ధరంగం నుంచి బయటికొచ్చి మూలపడవలసిన స్థితి రాకూడదనుకుంటాడు. కానీ వచ్చేసింది. అలాంటి పరిస్థితిలో కూడా తాను చేయగల పని ఏదైనా ఇవ్వమని పార్టీ నాయకత్వాన్ని అర్థిస్తాడు పావెల్. నిత్యం జనాల మధ్య వుండలని ఆరాటపడతాడు. ఆరోగ్యం చక్కబడుతుందనే ఆశ అడుగంటిన దశలో తన జీవితానికి ఒక గమ్యాన్ని, సార్థక్యాన్ని ఏర్పరచుకునేందుకు ఒక పథకం వేసుకొంటాడు. కదలమెదలలేకపోయినా ప్రజలకూ, వారి పోరాటాలకూ దూరంగా వుండడం అతనికి సాధ్యం కాదు. ఈమారు మరోకొత్త ఆయుధంతో రంగంలోకి దిగబోయేడు. రచనలను తన ఆయుధం చేసుకోవాలనుకొంటాడు. కొత్తగావస్తున్న యువకులకు నూతనోత్తేజాన్నీ, కమ్యూనిస్టు శిక్షణనూ అందించగల రచన సాగించాలనుకొంటాడు. ఆ విధంగా పార్టీకి సేవచేయాలనుకొంటాడు.

ఇక్కడే మనం ఒక విషయం చెప్పుకోవాలి. సాధారణంగా మనం ఒక దెబ్బ తగిలితే కుటుంబ సభ్యులు కుంగిపోతారు. కానీ అతను మాత్రం అలా కాదు. అంధత్వం ఆవరించినా ఏమాత్రం వెనుకంజ వేయకుండా రచనా వ్యాసంగంవైపు మొగ్గుచూపుతాడు. అందులో ప్రావీణ్యం పెంచుకొని సమాజంలో ప్రబలుతున్న పెడధోరణులను, సోవియట్ పరిణామాలను యువతకు అందిస్తాడు. ఏదైనా అనుకోనిది జరిగినా ఏమాత్రం నిరాశానిస్పృహలకు లోనుకాకుండా అకుంఠిత దీక్షతో ఎలా పనిచేయాలో చెప్తాడు పావెల్.

పూర్తిగా అంధకారంలో కూరుకుపోయాక కూడా పార్టీలోనూ, పార్టీ వారితోనే పనిచేయాలని ఆశపడతాడు. కోటోవ్‌స్కీ డివిజన్ వీరకృత్యాలను నవలగా రాయాలనుకుంటాడు. చూపు లేకుండా ఆ పని పూర్తి చేయాలంటే ఎంతో పట్టుదల కావాలి. అదే అతన్ని ముందుకు నడిపింది. తాను రాసిన ప్రతి మాటా గుర్తుపెట్టుకోవాల్సి వచ్చేది. ఒక్కోసారి పేజీలకు పేజీలు ప్రకరణాలను సైతం గట్టిగా అప్పచెప్పేవాడు. ఆ సమయంలో కొడుక్కి మతిపోలేదుకదా అని తల్లి ఆందోళన చెందేది. తన సమయాన్ని, శక్తినంతా నవల రాయడానికే వెచ్చించాడు. కొంత రాశాక మరి సాధ్యం కాలా. పట్టు విడవకుండా భార్యతోనూ, ప్రియమిత్రులతోనూ రాయిస్తాడు. ఎంతోకఠోర నిష్ఠతో పూరిస్తాడు. అనంతరం దాన్ని లెనిన్‌గ్రాడ్ ప్రాంతీయ పార్టీకి పంపుతాడు. అది ప్రచురణకు అంగీకారం పొందితే తను మళ్లీ పార్టీ సభ్యుల మధ్యకు వెళ్ళినట్టేనని భావిస్తాడు. అదే మనం ఇవాళ చెప్పుకుంటున్న నవల.

ఈ పుస్తకం చదివాక నా పనిలో కొంత మార్పు వచ్చిందనుకుంటాను. అంతకుముందు బద్ధకం వుండేది. దాన్ని వదులుకున్నాను. ఓ పుస్తకం చదవడానికి నెల రోజులు తీసుకునేవాణ్ణి. అలాగే ఏదైనా పని విషయంలో కొద్దిగా బద్ధకించేవాణ్ణి. చేయొచ్చులే అనుకునేవాణ్ణి. ఇప్పుడది తగ్గింది. అనుకున్న పనిని అనుకున్న సమయంలో అవసరం మేరకు పూర్తి చేయడం నేర్చుకుంటున్నాను. అంతేకాక జీవిత లక్ష్యానికి ఒక స్పష్టత వచ్చింది. ఆ తర్వాత ఎంతో మంది యువతీ యువకులకు చదవమని చెప్పాను. చెప్తుంటాను కూడా.

★

అది 1987వ సంవత్సరం. అసెంబ్లీ ఎన్నికలు జరిగే రోజులు. బోడేపూడి వెంకటేశ్వరరావుగారు బరిలో వున్నారు. మధిరలో పగలంతా ఎన్నికల ప్రచారం చేసేవాళ్లం. రాత్రుళ్లు లైబ్రరీలో పుస్తకాలు తిరగేసేవాళ్లం. సరిగ్గా అప్పుడు 'కాకలు తీరిన యోధుడు' నవల నా చేతికి వచ్చింది. చదవడం మొదలెట్టిన దగ్గరనుంచీ తర్వాత ఏం జరుగుతుందోనని ఒకటే ఉత్కంఠ. పూర్తి కావడానికి ఏడు రోజులు పట్టింది. ఇప్పటి వరకు ఇన్ని పుస్తకాలు చదివినా నాలో స్ఫూర్తినింపిన పుస్తకమది. ఇప్పుడు మళ్లీ ఇన్ని రోజుల తర్వాత ఎన్నికలకోసం పని చేస్తూ ఆ నవల గురించి రాయాల్సి రావడం కాకతాళీయమే అయినా మూడు విషయాలు చెప్పకోవాలి. పార్టీ ఏ పని చెప్పినా ఎక్కడికి పంపినా మనస్ఫూర్తిగా పూర్తిస్థాయిలో పనిచేయాలన్నది మొదటి విషయం. పెద్దగా చదువుకోకపోయినా పేదరికం నుంచి, పీడన నుంచి విముక్తి పొందాలంటే పోరాటమే మార్గమన్నది రెండవ విషయం. నవలలోని కథానాయకుడు చదువుకుంది తక్కువే. అయితేనేం తన చుట్టూవున్న వారి జీవితాలను, అందులోని సాదకబాధలను నిత్యం అధ్యయనం చేశాడు. వారి మంచి కోసమే పాటుపడ్డాడు. ఈ తరహా నిరంతర అధ్యయనమనేది మనకు కూడా ఎంతగానో ఉపయోగపడుతుంది.ఆ అధ్యయనమే ఒక సాధారణ కార్యకర్తను సైతం నాయకుడిగా మారుస్తుందన్నది మూడవ విషయం.

సీరియల్

జరిగినకథ:

గనిలో ఓరోజు అనుకోకుండా డైనమైట్ పేలి ఇద్దరు పనివారు చనిపోతారు. అయితే వారి కుటుంబానికి యాజమాన్యం ఎటువంటి సాయమూ అందించదు. దాంతో ఈ విషయమై కార్మికుల మధ్య చర్చ నడుస్తుంది. దోపిడీ నుంచి కొద్దిగానైనా బయటపడాలంటే కలిసికట్టుగా ఎదుర్కోవాలని నిర్ణయించుకుంటారు. అయితే కార్మికుల్లో వచ్చిన మార్పును గనిని కౌలుకు తీసుకున్న కాంట్రాక్టరు తివారి కనిపెడతాడు. గని మేనేజరు, ఇంజనీరు, మైనింగు మేస్త్రీ, గుమస్తాలతో ఒక సమావేశం ఏర్పాటుచేస్తాడు. తన మనసులోని మాట చెప్పకుండా వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకోవడం మొదలెడతాడు. ఆ తర్వాత...

తమిళ మూలం : కె. చిన్నప్పభారతి

అనువాదం : వి. వెంకటేశ్వర

(ఆరవ భాగం)

'**బొ**గ్గు ధర పెరుగుతుందని అంటున్నారు. మీ ఆలోచనను తెలియజేయండి'

వాళ్ల పరస్పరం చర్చించుకొన్నారు. గీత గీసినట్లు నిర్ణయం తీసుకోవడం వీలుపడదు. ఖచ్చితంగా ఎవరు మాత్రం చెప్పగలరు? మనదేశంలో బొగ్గు ఏ మాత్రం అవసరమవుతుందీ, విదేశాల్లో ఎంత ఉత్పత్తి జరుగుతోందీ వగైరా అంశాలను బేరీజు వేసుకోవలసి ఉంటుంది. అలా ఎన్ని లెక్కలు కట్టినా, అంతర్జాతీయ పరిస్థితుల్లో వచ్చే మార్పుల్ని బట్టి అనేక సాదకబాధకాలుంటాయి. తాము వెలిబుచ్చే అభిప్రాయం తమను ఇబ్బందుల్లో పడవేయకుండా ఉండాలి. ఏ క్షణంలోనైనా అపాయాన్ని ఎదుర్కొనబోతున్నట్టు ఒత్తిడికి లోనయ్యారు. అందరి తరఫునా మేనేజరు మాట్లాడాడు.

'కార్మికులు తమ జీతాలను పెంచాలని అడగబోతున్నట్టు తెలుస్తోంది. ఈ తరుణంలో మనం వ్యూహాత్మకంగా వ్యవహరించాలి' యాజమాన్యాన్ని ఉసిగొలుపుతున్నట్టు స్పష్టంగానూ, ఖచ్చితంగానూ చెప్పి, కొద్దిగా ఆగి, తివారీ కేసి చూశాడు.

వ్యూహాలు పన్ని తన బొక్కసం నింపుకొనే తివారీకి మేనేజరు మాటలు ఉత్సాహం కలిగించాయి. 'చెప్పండి' అన్నాడు. నిశ్చలత్వమూ, సహనమూ ఎలాంటి విషాదాన్నైనా దిగమింగుకొనేతత్వం మేనేజరుది. 'బొగ్గును నిల్వ చేయడం గురించి మనం కార్మికుల వద్ద ఇలా చెబుదాం. ఇంతకాలం ఈ వ్యాపారంలో లాభాలు రాలేదు. ఇప్పుడు లాభం వచ్చే సూచనలున్నాయి. అయితే



అందుకు చాలా పెట్టుబడి కావాలి. మీకు కొన్ని నెలల పాటు ఆహారానికి అవసరమయ్యే రేషన్ మాత్రమే ఇవ్వగలుగుతాం. మీ జీతాన్ని పెట్టుబడి పెడతాం. లాభాలు రాగానే, మీ జీతంతో పాటు, ప్రోత్సాహాలు కూడా ఇస్తాం. జీతాలు కూడా పెంచుతాం.

ఈ మాటలు వింటున్నప్పుడూ తివారీకి నెత్తిన పాలు పోసినట్టనిపించింది. 'ఎంత గొప్ప ఆలోచన?' అనుకొన్నాడు. ఇద్దరి చూపులు కలుసుకొన్నాయి. ఒకరి మనసులోని మాట మరొకరి మనసులోకి బట్వాడా అవుతున్నట్టుంది.

రొట్టెముక్క కోసం నోరు వెళ్ళబెట్టే కుక్కలాగా తివారీ ఓ మారు ఆవలించి మాట్లాడసాగాడు.

'ఆలోచన బాగానే ఉంది. కార్మికులు ఒప్పుకుంటారా'?

క్లిష్టమైన విషయాన్ని ప్రస్తావించే ముందు, అనవసరంగా కనిపించే సమస్యల్ని తుడిచి పారేస్తున్నట్టు, నుదురు రుద్దుకుంటూ మేనేజర్ చెప్పాడు.

'మీరన్నట్టు ఇది తేలికైన పనేమీ కాదు. మనం వాళ్ళలో ఇలా భయం కలిగిస్తే, వాళ్ళు వెనక్కు తగ్గుతారు. గని పాతబడి పోయింది, బొగ్గు అంతగా లభించడం లేదు. అందువల్ల గనిని తాత్కాలికంగా మూసేస్తున్నామని ప్రకటిద్దాం. వాళ్ళు బెంబేలెత్తిపోతారు. అప్పుడు చాకచక్యంగా మనం అనుకున్నది సాధించవచ్చు.

పిల్లి జాగ్రత్తగా చూసుకుంటూ వెళ్ళి మెట్లెక్కినట్లు, ఈ ఉపాయానికి బాగా ఆలోచించిన మీదటే సమ్మతించాడు తివారీ. కోతికి కల్లు తాగించినట్లుంది. "ఒక సంస్థలో ఉండడానికి నీవు అర్హుడివే. ఆలోచన ఏ మేరకు ఆచరణలో పెట్టగలవో చూడాలి. దీన్ని అమలు పరచగలిగితే నీకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తాను. అమలు పరచే బాధ్యత నీదే. నేను మా అమ్మాయి వివాహ ప్రయత్నాల్లో ఉన్నాను" అంటూ అందరితో కరచాలనం చేసి, సెలవు తీసుకొన్నాడు తివారీ.

5

ఎట్టకేలకు తివారీ కూతురికి పెళ్ళి కుదిరింది. ఎన్నో రోజులుగా సంబంధాలు చూస్తున్నా, జాతకాలు సరిపోతే అబ్బాయి నచ్చడు. అబ్బాయి నచ్చితే జాతకాలు సరిపోవు. ఇలా అమ్మాయికి ముప్పై ఏళ్లు దాటాయి. ఒక్కతే కూతురు. గారాబంగా పెంచారు. కార్మికుల చెమట పీల్చుకొని, కూడబెట్టిన సంపదకంతటికి ఏకైక వారసురాలు. పదిహేను కిలోల మేరకు బంగారు నగలు చేసి పెట్టానని తివారీ గొప్పలు చెప్పుకుంటాడు. చెప్పులకు పైతట్టు బంగారు రేకు అమర్చాననీ, ఆ రేకుల్లో వజ్రాలు పొదిగాననీ అందరి దగ్గరా చెప్పుకొంటాడు. పెండ్లి సందర్భంలో అమ్మాయి ఆ చెప్పులే వేసుకుంటుందని తివారీ చెబుతుంటాడు (ధన రూపేణా, నగల రూపేణా కూడబెట్టిన సంపదంతా). కార్మికుల శ్రమను దోచుకోవడమే కాకుండా వాళ్ళ బిడ్డల తిండినీ, చదువునీ, ఆరోగ్యాన్నీ, కుతూహలాన్నీ లాక్కొని వాళ్ళ ఆడపిల్లల యవ్వనాన్నీ, సౌందర్యాన్ని, వివాహాన్నీ ధ్వంసం చేసి కూడబెట్టినవేనని కార్మికుల నాయకులు చెప్పడం అతడు విన్నాడు. అమ్మాయికి పెళ్ళి సంబంధం కుదరక పోవడానికి కార్మికుల

శాపనార్థాలే కారణమేమోనని ఒక దశలో భావించి, ముడుపులు కట్టాడు. ఇంట్లో శాంతి చేయించాడు. దేవుళ్ళ హుండీల్లో వేల కొద్దీ వేశాడు. పెళ్ళి సంబంధం కుదరడంతో హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు. ఒకే వ్యక్తి ధనికుడు కావడంగానీ, పేదవాడుగా ఉండడంగానీ భగవంతుని లీలావినోదమేనని తనకు తానే ఓదార్పుగా చెప్పుకున్నాడు.

తివారీ భార్య శకుంతలాదేవి ఒకరోజు "గనికి మనమే యజమానులమని అందరూ చెప్పుకొంటున్నారు. శుభలేఖలో అలాగే ఉంటుంది కదా?" అని అడిగింది.

అలా అడుగుతున్నప్పుడు నెమలి కళ్లలాంటి ఆమె కళ్లల్లోంచి వెలువడ్డ కాంతి, అద్దాల్లాంటి ఆమె చెక్కిళ్లపై మెరిసి, ఆమె అందాన్ని ఇనుమడింపజేసింది.

దీర్ఘంగా ఆలోచిస్తున్నవాడిలా కిటికీలోంచి బయటికి చూస్తూ 'అవును' మనం యజమానులమే. కార్మికులకు జీతాలిచ్చే వాళ్ళను యజమానులంటారు. మనమే కదా జీతాలిస్తున్నాం' అన్నాడు చిరునవ్వుతో.

అతడికి గతం గుర్తొచ్చింది. గ్రామంలో పూజారిగా ఉండేవాడు. దేవుని మాన్యం భూములే జీవనాధారం. ఆ నేలలో ఇల్లు కట్టడానికి అనువైన మట్టి దొరకడమే కాకుండా, ఇటుకలబట్టీ వేసుకోవడానికి కూడా అది అనువుగా ఉండేది. అతడికి తన కులవృత్తిని మించిన వ్యాపార దృష్టి అలవడింది. ఎద్దుల బండ్లున్న కొందరు భూమిని గుత్తకు తీసుకొని మట్టి తీసుకెళ్ళేవారు. తన దగ్గర నేల ఉంది. ఎద్దుల్నీ, బండినీ కొని, కూలి మనుషుల్ని పెట్టి మట్టి తవ్వి పోసి వ్యాపారం చేస్తే మట్టి కాస్తా బంగారమవుతుందని అంచనా వేశాడు. ఆలోచన త్వరలోనే కార్యరూపం దాల్చింది. ముందు మట్టిని మాత్రమే అమ్మేవాడు. పోను పోను గృహ నిర్మాణానికి అవసరమైన ఇటుకలు, కంకర, ఇసుక ఇలా అన్నింటినీ సరఫరా చేయాలని నిర్ణయించి మరికొన్ని బండ్లు కొన్నాడు. ఇళ్లు కట్టించి ఇచ్చే వాళ్ళకూ, అతనికీ మధ్య సంబంధాలు గ్రామం నుంచీ నగరం దాకా విస్తరించాయి. సొంతంగా ఇటుకల బట్టీలు వేశాడు. ఒకే ఒక కూలి మనిషిని పెట్టి పనిచేయించుకొన్న రోజులు పోయాయి. అతడి దగ్గర పనిచేసే మనుషుల సంఖ్య యాభైకీ, ఆపైన వందకూ పెరిగింది. అనేక మందికి జీతాలిచ్చే యజమానిగా సమాజంలో అంతస్తూ పెరిగింది. గుడిపూజ సక్రమంగా చేయడం కష్టమనిపించింది. అయితే దైవ ప్రతినిధిగా సమాజంలో ఉన్న ఉన్నత స్థానాన్ని వదులుకోడానికి మనస్కరించలేదు. వంశపారంపర్యంగా వచ్చిన హక్కును వదులుకోరాదని నిర్ణయించి తన తరఫున గుడిపూజ నిర్వహించడానికి యాజ్ఞీకం తెలిసిన ఇద్దరు బ్రాహ్మణులను నియమించాడు. వాళ్ళకు తానే జీతం ఇచ్చేవాడు. అతడు ఆర్థికంగా ఎదిగిపోయినందువల్ల అతడు సంప్రదాయాన్ని తోసిరాజని కొత్త పద్ధతులు అవలంబించినా గ్రామస్థులు ప్రశ్నించలేదు.

హారతి పళ్లెంలో పదో, పరకో వేయకపోతారా అని ఒక్కొక్క భక్తుడి దగ్గరా ఎదురుచూసే పరిస్థితి కాస్తా మారిపోయి పదిమందికి జీతాలిచ్చే యజమానిగా ఎదిగాడు. సంపద చేరే కొద్దీ దాన్ని మరింత లాభదాయకమైన వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టాలనిపించడం సహజం కదా! ఈ బొగ్గు గనిని గుత్త కివ్వనున్నారని తెలిసింది. అది ఓ బినామీ పేరిట ప్రభుత్వంతో ఒప్పందం చేసుకొన్న ఓ పోలీసు అధికారికి చెందిన గని.

ఇటుక బట్టీ వ్యాపారానికి బొగ్గు గని నిర్వహించడానికీ చాలా తేడా ఉందని అతడికి ఈ వ్యాపారంలో దిగిన తర్వాతే తెలిసింది.

విడిగా ఉన్న వ్యక్తుల్నీ, కలివిడిగా ఉంటే ఎంత శక్తి ఆవహిస్తుందని! వాళ్ళ మాటల్లో ఎంత రాజకీయ పరిజ్ఞానం! వాళ్ళ నినాదాల్లో ఎన్నెన్ని ఆర్థిక సూత్రాలు! వాళ్ళు మూకుమ్మడిగా గర్జిస్తే, ప్రభుత్వాల అణచివేతగానీ, తుపాకీ మోతగానీ బండరాతిని ఢీకొన్నట్టు నిష్ప్రయోజనం కావలసిందే. సంకెళ్లు గానీ, చెరసాలలుగానీ <u>తుత్తినియలు</u> కావలసిందే. వాళ్ళు ప్రపంచ నిర్మాతలు. ఒక్కొక్కరూ పేదరికంలో మగ్గుతున్నా, ఉమ్మడిగా అపార సంపదను సృష్టిస్తారన్న విషయం గనిని నిర్వహిస్తున్నప్పుడే అతడికి బోధపడింది. కార్మికుల పోరాటాలు తనకు అశాంతి కలిగిస్తుందనీ, వాళ్ల శ్రమ తనకు బొగ్గు రూపంలో బంగారాన్ని పండిస్తుందనీ గ్రహించాడు.

హారతి పళ్లెంలో చిల్లర డబ్బుల కోసం ఆత్రంగా ఎదురుచూసే తనకూ ఇంతటి మహర్దశ కలిగిందంటే అది అమ్మవారి చలవేనని పదేపదే గుర్తు చేసుకొంటాడు.

నేతలైతేనేమి, అధికారులైతేనేమి, మంత్రులైతేనేమి, డబ్బు కావాలని రకరకాల మనుషులు తన గుమ్మం తొక్కుతారు. ప్రతిఫలంగా ఏంకావాలో అడగండి. మీ పనులు చేసి పెడతామంటారు. డబ్బు సమకూరిస్తే సమాజంలో మానవుడి హోదా ఎంతగా పెరిగిపోతుంది! పాత అలవాట్లూ, సుగుణాలూ పోయి కొత్త అలవాట్లూ, వ్యసనాలూ వచ్చేస్తాయి. డబ్బు లక్షణం అదే కదా! ఇలా పాత విషయాలను గుర్తు చేసుకొంటున్న వాడల్లా, వర్తమానంలోకి వచ్చి "నిశ్చితార్థానికి ఎవరెవర్ని పిలవాలో వియ్యంకులవారికి చెప్పి రావాలి కదా!" అన్నాడు.

ఆమె మనసంతా గజిబిజిగా ఉంది. డబ్బు ద్వారా కొత్తగా కలిసిన సంబంధీకుల్ని పిలవాలా? లేక పాతబంధువుల్ని పిలవాలా? పాత బంధువులయితే, తమ ప్రస్తుత హోదాకూ, గౌరవానికీ తగిన నాగరిక ధోరణులు గానీ, నగానట్రా, పట్టుచీరలు వంటి హంగులు గానీ ఉండవు! వీళ్లని తీసుకెళ్తే తమకు తలవంపులు కాదా? గనుల శాఖా మంత్రి సమక్షంలో లగ్నపత్రిక రాసుకోబోతున్నారు. ప్రస్తుతానికి పాతబంధువుల్ని పక్కన పెట్టాల్సిందే. పెళ్లికి పిలవొచ్చు. కార్మికుల గుంపుతో బాటు వాళ్ళూ కలిసిపోతారు. ఆ హడావుడిలో ప్రత్యేకంగా బంధుత్వాన్ని ఎవరు పట్టించుకొంటారు? కానీ, మా ఇద్దరి తరఫునా తల్లిదండ్రులనూ, అన్నదమ్ముళ్లనూ, అక్క చెల్లెళ్లనూ పిలవక తప్పదు కదా. వాళ్లింకా పూజారులుగానూ, పురోహితులుగానూ బతుకు వెళ్లబుచ్చుతున్న వాళ్ళే! కొద్దో గొప్పో చదువుకొని, చిన్నపాటి ఉద్యోగంలో ఉన్నా నాగరిక ధోరణులు తెలిసి వచ్చేవి. ఇప్పుడేం చెయ్యాలి?!

ఆలోచిస్తూ తలగోక్కొంది. చేతివేళ్లలోకి వచ్చి చేరిన మురికిని ఎడమచేతి బొటన వేలితో తొలగించింది. పెద్ద పేనొకటి కనిపించింది. 'ఛ! ఎలాంటి తరుణంలో ఇది నా తలలో కొలువుదీరింది. కాబోయే వియ్యంకుల వాళ్లింట్లో కూర్చుని ఉన్నప్పుడు మెడపైనో, బట్టలపైనో ఇది షికార్లు కొడితే ఎలా ఉంటుంది? అనుకొంటూ దాన్ని చిదిమి చంపేసింది. చిదుముతూనే, బెంగాలీ సంప్రదాయానుసారం 'స్' అంది. అప్రయత్నపూర్వకంగా. ఇలా చెబితే ఆ పేనుకు స్వర్గం ప్రాప్తించదట, ఆమె తనలో తానే నవ్వుకొంది. 'మానవుడే తాను చేసిన పాపాలన్నీ కరిగిపోయేదాకా పక్షిరూపంలో తిరుగాడుతుండగా పేనుకు స్వర్గమా!' అని దీర్ఘంగా నిట్టూర్చింది.

ఆమె మౌనంగా ఉండడం గమనించి తివారీ "ఇందులో పెద్దగా ఆలోచించాల్సిన పనేముంది? ఇరవై ముప్పై మంది చాలు. మంత్రిగారినీ, డిఎస్పీ, కలెక్టరు, వ్యాపారంలో సన్నిహితుల్ని పిలిచినా ఇంతకన్నా ఎక్కువమందవుతారు" అంటూ తన ప్రస్తుత స్థితికి అనుగుణంగా చెప్పాడు.

తన భర్త కూడా తనలాగానే ఆలోచిస్తున్నాడా? అతనికి తల్లిదండ్రులపైనా, బంధువులపైనా ఏనాడూ ప్రేమాభిమానాలు లేవు. పైపైకి మాట్లాడ్డం వరకే వాళ్లతో అతడి సంబంధం పరిమితం. ఐశ్వర్యం రాగానే, బంధువులంతా అసూయాగ్రస్తులవడం, ఇతడికి కళ్లు నెత్తికెక్కాయని దూషించడం తానెరిగిందే. కానీ తన తోబుట్టువులు అలా కాదే! అత్తా, పిన్నీ, పెద్దమ్మా అంటూ ఎంత ఆప్యాయంగా ఉంటారు! వేసవి సెలవుల్లో ఇక్కడికి వచ్చేసి ఎంత సందడి చేస్తారు! అమ్మాయికీ వాళ్లంటే ప్రేమాభిమానాలు మెండు. ఏం చేయడం? గతాన్ని విస్మరించి వర్తమాన పరిస్థితులను మాత్రమే దృష్టిలో పెట్టుకొని ఎలా ఆలోచించ గలిగింది తను? మగవాడు అలా ఆలోచించినా, మాతృహృదయం కలిగిన స్త్రీ అలా ఆలోచించవచ్చా? దేవుడా! ధనం వల్ల ఒనగూరే సంబంధాలన్నీ సముద్రం ఒడ్డున కట్టుకొనే పిచ్చుక గూళ్ళవంటివి కావా? ఎంత అసూయా, ఎంత ద్వేషమూ ఉన్నా ఆజన్మాంతం నిలబడేది రక్త సంబంధమే కదా! వక్రబుద్ధితో ఆలోచించడం సముచితం కాదు. ఇద్దరి తరఫు బంధువులనూ ఆహ్వానించాల్సిందే. మట్టిదారిలో పయనిస్తే విత్తనానికి గౌరవం!

(ఇంకావుంది)

కథ

- వై. కుసుమ కుమారి

"అమ్మా ఆకలేస్తోంది" అరిచాడు కరువోడు.

"ఏంచేస్తున్నావే? బిడ్డ అల్లల్లాడిపోతున్నాడు. వచ్చి ఏదో ఒకటి పెట్టి ఆడిని కుదుటపడేట్టు చెయ్" నెలరోజులుగా మంచంపట్టిపోయి మూలుగుతున్న అశిరయ్య పెద్దగొంతుతో అరిచాడు.

"నీకేటి పట్టుకుంది ఇంతెత్తులేచి అరుస్తున్నావు. సూదిడాట్టర్ వచ్చినపుడు అతగాడేమి అడిగినా నంగి మూలుగులు మూల్గుతావు. మరి నీకు రోగమేటో తెలిసిసావదు. సరైన మందు నీకిచ్చిపోవడంలేదు. నువ్వు లేసి ఎళ్తేకదా ఇల్లు గడిచేది. ఈగుంటనాయలకు వయస్సు వచ్చింది. తండ్రిలా పాములు ఆడించుకుని వస్తే నాలుగుడబ్బులు వస్తాయి. ఈడు సిల్లరతిరుగుళ్లు తిరుగాడుతున్నాడు" ఉట్టిలో ఉన్న సిల్వర్ పాత్రను దించింది.

"ఆడిని ఏటి అనబోకే. నేను రేపోమాపో లెగిసిపోయి ఆటమీద ఆటేసి ఇల్లంతా డబ్బుతో నింపేస్తాను. ఈరోజు కొద్దిగా సర్దుకున్నట్టే ఉంది. నాకు జావ కాచినావా? ఆఈది బాపనమ్మనడిగి వొర్ర ఆవకాయ తీసుకురాయే. నాలిక జిహ్వ చచ్చి ఊరుకుంది. ఎంతకని మాత్రలు మింగుతానే. నోరంతా సేదు అయిపోయింది"

"బావుంది నీగొంతెమ్మ కోరికలు. ఇంట్లో దమ్మిడీలేదు. నెలరోజుల్నించి నులకమంచం ఒగ్గవు. మనమేటి పొలంతో ఉన్నామా? తిండి గింజలు గాదెలోంచి తీయడానికి, ఉన్నదల్లా ఇరవైబుట్టలు పాములు. అవే మనకింత తిండిపెడుతున్నాయి. ఆటికి మనం తిండి పెట్టలేక పోతున్నాం. ఈగుంటడు చెరువుకిపోయి ఇన్ని కప్పలు పట్టుకురారా అంటే ఇనడుగాక ఇనడు.

అమ్మా ఆకలేస్తోంది

రెండురోజుల్నించి బుట్టల్లో పాములకు తిండిలేదు. అవి బుట్టల్లో గలాయించి తిరిగేస్తన్నాయి. చూశావా కుదుపులు అవుతూ కన్పిస్తన్నాయి"

అశిరయ్య అటు నుంచి ఇటు తిరగబడి "అవునే అడగలేకపోయాను. నానీర్సం అలా నోరు మెదపనీయలేదు. ఎలాగే ఇళ్లుగడిపి నావు. పచారీ కొట్టుకాడ అరువెట్టినావా? మరెవుడికాడయినా సేబదులు తెచ్చినావా? అన్నట్టు పావలా ఒడ్డీ ఆడాళ్లకాడ ఐదురూపాయిల ఒడ్డీకి తెచ్చినావా?" ఆసక్తిగా అడిగాడు.

"నువ్వు సర్కార్‌లో పనోడివని పచారికొట్టోడు అరువిస్తాడు. ఆడు డబ్బు సూస్తేగాని మడిసికాడు. ఇక సేబదులు ఎవరిస్తారు? నువ్వునేను మేడలు మిద్దెలలో ఉంటే కదా గాలికి ఎగిరిపోయిన గుడిశెలో ఉన్నామాయె మనకెవరు ఇస్తారు. ఇక పావలా వడ్డీల అమ్మలక్కలు మనకిస్తారా?సంతల్లో వ్యాపారాలు సేసినోళ్లకి ఆరురూపాయలు, ఏడురూపాయలకు ఇస్తారు.." అని నాన్చింది.

"నేనేటి అడిగాను మాటకిమాట సెప్తావే. ఇల్లు ఎలా నడుపుతున్నావు? నాకు మందులు కొంతన్నావు? జావ పూటపూటకిస్తన్నావు. బిడ్డ తింటన్నాడు, నువ్వు తింటన్నావు. సెప్పే ఎలాగే ఇదంతా!"

"మనకి ఎంతలేదన్నా ఆరేడుమాసాలు కూకోని తినే ఆస్తులున్నాయికదా!"

ఆమాటలకు కరువోడు, అశిరయ్యా ఇద్దరు ఒకరిముఖాలు ఒకరు చూసుకున్నారు.

"ఏటేటి మనకి ఆస్తులున్నాయా?ఈగుడిశె ఎవరూ కొనరు. దీని మీద ఒకరూపాయి ఇవ్వరు. పోనీ ఇంట్లో ఏమైనా గట్టి వస్తువులున్నాయా అంటే అన్నీ ఇలవ తక్కువ వస్తువులే. మిగిలింది పాములు. ఆటిని చూస్తేనే కర్రాకత్తి తీసి ఏసేద్దామంటారు. మరి ఏటి మనకున్న ఆస్తి. ఈరోజు మనకి కాలుమీద కాలేసుకుని ఇంట్లో ఉంతే ఇంత ముద్దపడేస్తన్నాయి. ఎలా?" అశిరయ్య ఆలోచనలో పడ్డాడు.

"నువ్వు అన్నావే మన పాముల్ని అమ్మితే ఎవరూ కొనరు. కత్తో కర్రో తీసి వాటిని చంపేస్తారు. అది ముమ్మాటికి నిజం. జనాలందరికి వాటి అవసరంలేదు. కానీ, మనలాంటోళ్లకు ఆ అవసరం ఉంది. రెండురోజుల క్రితం ఐదొందలకు మాలేసుగాడికి నల్లతాసు, సింతనాగు అమ్మేశాను. ఆమీద రెండు బుట్టలు ఖాళీ! పోనీ ఆడికాడయిన ఇన్ని కప్పలు తింతాయి. అందుకే రెండు రకాల ఆలోచనతో ఆడి సేతిలో ఎట్టేశాను."

"అమ్మ ఎంతపనిసేసావే తప్పుడు నాయాల. సింతనాగు అయితే ఒకరోజు కాకపోతే ఒకరోజు అయిన ఆనల్లకొండల్లోనో ఆఎగువ మెట్టల్లోనో దొరుకుద్ది. నల్లతాసు దొరకదే. అది దొరకాలంటే పెద్దపున్నెం సేసుకోవాలే. ఇంత పెద్ద పడగ. అది ఇలా జనాలమద్య ఒగ్గితే దాని బుస సెవులకు సోకినపుడు ఈసకొట్టినట్టే. ఎంతపని చేసినావే" లేవలేక లేచి కూర్చున్నాడు.

అప్పుడే కాచినజావను పాత్రలో పోసి ముందుంచింది.

"నాకు తిండి ఒద్దే. సచ్చే ముందు నానల్లతాసును కళ్లార సూసుకుని జీవుడు ఒగ్గీయాలనుకున్నానే. ఎక్కడ పట్టినాను ఎలాపట్టినాను. ఎలా సాకినాను. ఎలా ముద్దుగా సూసుకున్నాను. అన్ని పాములకి కప్పలు తొండలు, ఎలకలు ఏసేసి నల్లతాసుకి రెండేసి కోడిగుడ్లు నాకడుపు మాడ్చుకుని ఏసినానే. " జుట్టు పీక్కుని తల బాదుకున్నాడు.

"ఓరయ్యా అదేటి ఆ సెత్తపాముల కోసం అలా తల బాదుకుంతన్నావు. సచ్చిపోగలవు. అమ్మా అమ్ముకుని డబ్బు సేసుకుంతంది. నేను పాముల ఆకలి సూడలేకపోతున్నాను.సెరువులో కప్పలు లేవు"

"సెత్త పాములేటిరా తప్పుడు నాకొడకా. అవే కదా నీకు, నాకు, నీతల్లికి మూడుపూటలా ఇంత తిండి పడేస్తున్నాయి. ఆటికి తిట్టకురా నీతల్లికి ఏంపోగాలంరా! రేయ్ కరువూ నామాట ఇనుకుని ఆమాలేసుగాడ్ని ఎతికి నల్లతాసు ఇచ్చీమని అడిగి తెచ్చేయరా? దాన్ని సూసుకుని కదా మంచంమీద కళ్లలో ఇంతకాలం పేణాలు నిలుపుకున్నాను."

"నీకేటి మాయరోగమో అర్దమై సావడంలేదు. పాములు పట్టేటోడివి నీరోగం తగ్గాక ఆకొండల్లోకి పోయి రెండో మూడో నల్లతాసులను తెచ్చీసుకోకూడదా? ఇలా పెడబొబ్బలెడుతున్నావు. పెపంచకంలో ఒక్కటే

నల్లతాసున్నట్టుగా గోలెట్టేస్తన్నావు."

"నీకు తెలీదే నల్లతాసులు అరుదు. నాఆట గతి తప్పిపోయింది. ఆమాలేసుగాడు నా పాములాటప్పుడు నల్లతాసువైపే దుష్టి నిలిపినపుడు ఇలాసేస్తాడు అనుకోలేదు. నాకు ఆకలి సచ్చిపోనాది" నీర్సంగా కుక్కిమంచంలోకి వాలిపోయి కళ్ళు మూసుకున్నాడు.

అశిరయ్యా సాయింత్రం నుంచి మగతగా నల్లత్రాచుకోసం కలవరించసాగాడు. తల్లీకొడుకు ఆపాము విషయంలో ఏమాత్రం పట్టించుకోలేదు. జావ తినిపించాలని ఎంతో ప్రయత్నం చేసినా అశిరయ్యా తినలేదు. మొండిగా కాదనేశాడు.

వేకువజామున అశిరయ్యా మంచంమీద లేచి కూర్చున్నాడు. నీర్సంగానే గుడిశెలో ఒకమూలున్న రేకుపెట్టె తెరిచి అందులోంచి యాభైరూపాయిలు తీశాడు. పొడుగాటి కర్ర ఊతంతో పచారికొట్టుకి పోయి కోడిగుడ్లు కొని తీసుకుని గుడ్డసంచిలో వేసుకునివచ్చి ఒక్కో పాము బుట్టలోకి రెండేసిగుడ్లు వేశాడు. పదడుగులు కొండ చిలువకు నాలుగు గుడ్లువేశాడు. తిరిగి బుట్టలను కలిపి తాడుతో కట్టేసి మంచం వరకు వెళ్లలేక కళ్లుతిరిగి దభీమని పడిపోయాడు.

అక్కడే పడుకున్న తల్లీ కొడుకు లేచి అశిరయ్యను పట్టుకుని కుక్కిమంచంమీద వేశారు. వారికి ఏమి అర్థంకాలేదు. "నన్ను పిలవలేక పోయావా? నిన్నంతా మొండికెత్తి తిండిలేక మాడిపోయావు. పోనీ జావ కాసి తీసుకురావాలా?"

"నాకేమి వద్దు. నాకు నల్లతాసు చూస్తేగాని తిండి సయించదు."

"నీసొద నీదేగాని ఆమల్లేసుగాడికి ఇచ్చాక ఆడు ఆపామెత్తు బంగారమిచ్చినా ఈయడు. దాన్ని మరసిపో! నీకేటి నువ్వు ఇలా ఎల్లి అలా తేగలవు. అన్నట్టు నల్లతాసులు నాగుపాముల కానుపులో వందగుడ్లు పేలితే సగం సగం జెర్రిగొడ్డులు, నాగుపాములు అవుతాయంట. వాటిల్లో ఒకటో రెండో నల్లతాసులుంతాయంట. నీకు దొరుకుతాయి. నామాటినుకుని జావ తాగేసినావంటే నీరసం ఉండదు. సెట్టంత మనిసివి ఇలా మంచానికి అంటుకుని నెలనుంచి సూరుసూసుకుని ఉండిపోనావు" నాలుగు మంచి మాటలు చెప్పింది.

అయినా అసిరయ్య కళ్లు మూసుకుని బదులీయలేదు.

"ఓర్నాయినా నీఅయ్యబుద్ధి ఇలా తెల్లారింది. నువ్వేమో ఇటు పిలిస్తే అటు పలుకుతున్నావు. నేను ఎలా ఏగాలో నాకే తెలీడంలేదు. నువ్వు పెద్దచెరువుకి పోయి కప్పలట్టుకురారా! లేవనీకు"

"మీరేటి నాపాములకి పెట్టక్కర్లేదు. ఆటి ఆకలి మీకు తెలీదు. విశ్వాసం లేని జన్మలు మీవి. ఇందాక పోయి యాభైరూపాయిల గుడ్లు కొనీసి తెచ్చిపెట్టాను." కళ్లు విప్పకుండానే చెప్పాడు.

"ఉన్న యాభైరూపాయిలు ఈ దిక్కుమాలిన జీవాల పాలపడీసినావా? నీకు మందుకొనాల. పిల్లగాడు ఈయాల ఎక్కడో పనికి ఎల్తాడంట సల్ది కట్టీమన్నాడు.దానిలో నంజుకోవడానకి కోడికాళ్ల బుర్రలు వండమన్నాడు. మరేటి కొంతాను. నీకేటి పట్టుకుంది ఇంత ఈనమైన పనిచేసావు" అని కళ్లు తుడుచుకుంది.

అప్పుడు కళ్లు విప్పాడు అసిరయ్య "ఏటిరా నువ్వు పనిలో కెడుతున్నావా? రెక్కలు ముక్కలు సేసుకుంతావా? మన పూర్వీకుల నుంచి వచ్చిన పాములాటపని ఒగ్గేస్తావా?"

"మంచి ఉద్యోగం దొరికిందయ్యా! నువ్వు రోజుకి పదిచోటుల్లో పాముబుట్టలిప్పి ఆటేస్తావు. పదిఆటలకు కలిపి వచ్చేది యాభై అరవై. ఒక్కోసారి అదీరాదు. ఒకూరు అని ఉండదు. ఊళ్లుపట్టిపోవాలా? ఎవరూ బుట్టలతో బస్సు ఎక్కనీయరు. బుట్టలు కనబడకుండా గుడ్డలతో కట్టీసి ఎక్కితే కొంతమంది ఏమిఅనరు. గుడ్డల్లో ఉన్నది ఏమిటో తెలుసుకుంటే మధ్యలో దించేస్తారు. ఎందుకయ్యా ఆబతుకును సాగించాలనుకుంటావు?"

"నాకొండే నేనడిగింది సెప్పురా!"

తల్లి కళ్లలోంచి నీళ్లు వస్తుంటే తుడుచుకుని వింటోంది.

"ఆమధ్య మనం ఒకింట్లో నాగుపాము జొరబడిపోతే పట్టుకుని ఆళ్లకాడ రెండువందలు తీసుకున్నాం.నీలాగే జబ్బుపడి మంచానపడిన ఆయన నాకు ఈరోజు ఉద్యోగం ఇచ్చాడు. అతడికి జబ్బు తగ్గింది. బస్సులో అతడికి తోడుగా ఆళ్ల ఆఫీసుకు పోయి సాయింత్రం వరకు ఉండి వచ్చేయడమే.అంటే తోడు అన్నమాట. అందుకు ఏరోజుకారోజు ఒకవంద ఇస్తాడు. మనం ముగ్గురం యాభై తినేసినా యాభై మిగులు తుంది. ఆఉద్యోగం అతడు ఇంకా నాలుగేళ్లు చేస్తాడు. నాలుగేళ్లకు మనకాడ ఎంతో సేరుతుంది"

అశిరయ్యా విని కళ్లు తెరిచాడు. "ముందు ఈరోజు రేపు ఎల్లుండి మూడు రోజులు నాకు రోజుకు వంద సూపీయ్ అప్పుడు నమ్ముతాను. పదో పాతికో ఇస్తాడు కానీ మరీ వంద ఎవడు ఇస్తాడురా? అందులోకి నువ్వేటి అతడిని భుజానికి ఎత్తుకుని నడుస్తావా? నాకేదో సెప్పడానికి ఇలా సెబుతున్నావు"

కరువోడు మూడురోజులు మూడువందలు తెచ్చి ఇచ్చాడు.

అశిరయ్యా అప్పుడు నమ్మాడు.ఎందుకో అనుమానం వచ్చి పాముబుట్టలు తెరిచి చూశాడు. రెండుబుట్టలు తప్పితే మిగిలిన బుట్టలలో పాములున్నాయి. "పాములమ్మిన డబ్బు చూపిస్తున్నారు తల్లీ కొడుకు అనుకున్నాను. మంచిదేరా నీబతుకుతెరువు ఆలోచన. నాకు సెప్పినట్టు సుట్టుపక్కల ఎవడికి సెప్పకురా! ఆఉద్యోగానికి పోటీపడి పోయి వందనుంచి యాభైకి సేసేస్తామని దించీయగలరు"

"అయ్యా నా మాట విను. ఇప్పటికైనా ఈపాముల్ని ఒగ్గిదుం. ఆటి ఉసురు మనకి మంచిదికాదు. మనకి బతుకుదారి దొరికింది. ఒకవేళ ఉద్యోగం ఉట్టికెక్కిందే అనుకో అప్పుడు మనం ఏటి సేత్తాం? మన పని ఉందికదా! పాములాట!! ఇలా కొండల్లోకి ఎళ్లామంటే ఒకటా రెండా ఎన్ని అంటే అన్ని పాములు పట్టుకుని వచ్చేసి మళ్లీ ఆటమొదలెట్టేద్దాం. ముందు నామాటిని పాములు ఒగ్గేయ్"

"కొడకా ఉట్టిపుణ్యానికి వదిలేయొద్దురా! ఆమాలేసుగాడికి అన్నీ అమ్మేద్దుం.ఈమద్య ఆళ్లు ఏర్పాటులు అయిపోయినారంట. ఆళ్ల చిట్టి తమ్మడి వాటాకి పాములు రాలేదంట.ఆడు కొండలు గిరాయించి తిరుగుతున్నాడంట ఒక్కపాము ఈడిపాలపడలేదంట. ఆట ఎయ్యకుండా గోళ్లు గిల్లుతున్నాడంట. ఇప్పుడు మనపాములు బేరానికి పెడితే సక్కగా కొనీసుకుంటాడు. మన కొండసిలవ ఎట్టా లేదన్నా మూడువేలపై మాటే. మిగిలిన సిన్నాసితకా పాముల్ని రెండువేలకి ఇచ్చేదుం. ఇక ఆవచ్చిన సొమ్ము ఎవడుతినాల" పెద్దకళ్లు చేసుకుని మరీ చెప్పింది.

"నువ్వు ఆ మాలేసుగాడి మాట నావద్ద అనమాకు. నాకు సెడ్డ సిరాకుగా ఉంది. ఆడు బంగారంలాంటి నల్లతాసుమీద కన్నేసి కొట్టేసాడు. ఒకకార్డు ఏస్తే పట్టణంలో ఉన్న పాములపొట్టోడు వచ్చిపడి పోతాడు. ఆడికి అమ్మేదుం. ఆడు సంటిపిల్లల్ని సాకినట్టు పాముల్ని సాకుతాడు.రేయ్ నువ్వు డ్యూటీ నుంచి వచ్చినపుడు కార్డు కొనుక్కు రారా!"లేచి కూర్చుని చెప్పాడు.

"ఎందుకయ్యా మళ్లీ వాటికి బుట్టలబ్రతుకు? నేను ఆకొండల్లో వదిలేసి వచ్చేదునా?" కరువోడు పాముల బుట్టల్ని జాలిగా చూస్తు అడిగాడు.

"నాయనా నీకు ఇన్నాళ్లవరకు తెలీయదా? బుట్టల్లో పాములకు మనలా ఎవరైనా పెడితే తప్ప స్వయంగా సంపాదించుకుని తినలేవు. వాటికి మనం మూతులు పొడిచేస్తాం అదేరా కోరలు పీకేస్తాం. మరి ఎలా తిండి సంపాదిస్తాయి. వదిలేస్తే అవి బతకలేవు. అంతెందుకు సర్కస్ సింహాలను అడవుల్లో వదిలేస్తే అవి తిండిలేక ఛస్తాయి. సర్కస్ సింహాలకు వేట తెలియదు"

"అవన్నీ ఎందుకయ్యా మనకి. వాటికి విముక్తి లభించాలన్నదే నాఆలోచన. పాపం కొండసిలవకు మనం తగిన తిండిపెట్టలేకపోతున్నాం. మరి పాములపొట్టోడు మాత్రం పెడతాడా?" అని చిన్నబోయిన ముఖంతో క్యారియర్ పట్టుకుని వెళ్లిపోయాడు.

సాయింత్రం తిరిగివచ్చిన కరువోడికి గుడిశెలో పాముల బుట్టలు కన్పించలేదు "అమ్మా అమ్మేసావా? "ఆత్రంగా అడిగాడు.

"మీఅయ్యకు నీరోగంపట్టుకుని ఐదువేలు రూపాయిలు కాదనుకుని అన్నిటిని అదిగో ఆకొండల్లో వదిలేసి ఆ మూల పడుకున్నాడు.

కరువోడు చేతిలో కార్డును పెనకలో దోపేసి ఎగిరిగంతులేశాడు.

★

కవిత్వమ్

కథా నిలయం
శ్రీకాకుళం

అమ్మా... ఓ నా మమ్మీ

- చలపాక ప్రకాష్

'అమ్మా'
ఈ రెండు అక్షరాలని కన్నది
ఎవరమ్మా!
ఈ పద గారడీ నుండి తియ్యని తేనె పుట్టిందా?
తేనెకే ఈ తెనుగు పదం పట్టిందా?
ఈ బ్రతుకులో తేనె రుచి చూపిన
అమ్మా-
నాలుగడుగులేసి, నాలుగు పదాలు పలికిన ఈ నాలుకకి
నలుదిక్కులు తిరిగి
నాలుగు భాషల్లోని రుచి మరిగే సరికి
ఈ నాలుక నాలుగు రకాలుగా మొద్దుబారి
తేట తియ్యని తేనె రుచిని
తెగ వెగటు పుట్టించిందేమిటీ?

మన పెరట్లో మొలిచిన తెనుగు మొక్క
నలుదిక్కులా సుగంధాలను వెదజల్లుతోందిగానీ
నా నాసికకు ఏ మాత్రం సువాసనా శాతంగాని
నా చేతి రాతకు పనికట్టునిచ్చి నిలిపే 'ఆసరా'ని గాని
కల్పించలేకున్నదేమిటీ?

ఎన్నో వలస పక్షులు
ఎదిగిన ఈ చెట్టుపై వాలి, తియ్య తియ్యని
రుచుల్ని, సొబగుల్ని వెలికితీశాయి గాని
నాకెందుకు
ఆ ప్లాస్టిక్ పువ్వుల్నే తాకాలని ఉబలాటం?
అమ్మా...
ఈ వాకిలి, ఈ గాలి, ఈ నేల
ఈ పైరు, ఈ చెట్టూ పుట్టా అంతా నాదైనా
నాది కాకుండా ఉందేమిటీ?

అమ్మా...
ఆఖరికి నువ్వూ శ్మశానవాటికలో
'మమ్మీ'గా చిక్కి శిథిలమైపోయావేమిటీ?
నేనూ, నా వాళ్లు, మన వాళ్లందరూ
'మనం' కాకుండా పరాయి వాళ్లుగా వలసపోయి
ఉమ్మడి బంధాల గొలుసుల్ని తెంపేసుకుంటున్నామేంటీ?
అక్షరం, లక్షణం అన్నీ అవలక్షణంగా మార్చేసుకుని
మనమీద ఏదో శక్తి కక్ష సాధిస్తున్నదేమిటీ?
అందరం, మనమందరం తెలుగు బిడ్డలమని
సువిశాల హృదయులమని
ఛాతీ విరుచుకుని తిరిగాం కదా!
మరిప్పుడు
గడ్డకో బెడ్డగా....
రాచపుండుగా
తెలుగు పదకోశానికి చీడగా పట్టిందేమిటీ?
ఒక బిడ్డకి ఇద్దరు ముగ్గురు తల్లులేమిటీ?

భాషకి యాసకి సందుగొందులేమిటీ?
పదం పదం కాలు దువ్వి తన్నుకు చస్తూ
అక్షరం అక్షరం విడిపోవడమేమిటీ?
పచ్చని చేను ముంగిట విడిదిగా సేదతీర్చే
చల్లని ఈ 'భాషా' పుట్టింటిలో
మంట పెట్టిన అ'రాచకీయుడెవడు'?
రగులుతున్న మంటల్లో తగలబడుతున్నది
ఏ భాషా బిడ్డలు?.... చెప్పమ్మా...!

అదిగో.. అదిగదిగో...
అమ్మ కనుకొనల నుండి కన్నీటి బొట్లు!
ధారలై ప్రవహిస్తున్న రక్తపు జాడలు!!
చండ ప్రచండ ఘీంకారాలతో ఊగిపోతూ
జటా జటాలు వీడి ఉగ్రరూపం దాలుస్తూ
చేస్తున్న భయంకర కంకాళ నృత్యగీతం!
భాషా చైతన్యం రగిలిస్తూ
తెరుచుకుంటున్న మహా సింహద్వారం
పదండి... ఇప్పుడైనా పదండి
ప్రాచీనత... ఆధునికత అన్నది ముఖ్యం కాదు
మూగదైపోతున్న మన భాషా నోటిని తెరిచి
గొంతెత్తి పిక్కటిల్లేలా అరిచి
మన పద సంపదని మరొక్కసారి పరిరక్షించుకుందాం!
'మమ్మీ'ని భూస్థాపితం చేసే దిశలో
ఊపందుకుంటున్న చండ ప్రచండమైన ఈ మహా ఉద్యమం వైపు
నువ్వూ, నేను, చివర్న ఉగ్రరూపంలో 'అమ్మ'నూ!!?

★

30 రోజుల్లో
అలర్జీ - ఆస్తమా గుర్తించడం ఎలా?

ప్రపంచంలో మూడో వంతు మంది ఆస్తమా రోగులు మన దేశంలోనే వున్నారు. పర్యావరణ కాలుష్యం, వ్యాధిపట్ల అవగాహన లేకపోవడంతో 2025 నాటికి పది కోట్ల మంది ఆస్తమాబారిన పడే అవకాశముంది. ఆస్తమాతో మరణించేవారి సంఖ్య అధికంగా వున్న దేశాల్లో మన దేశానిది రెండో స్థానం. రోజు రోజుకు కాలుష్యం స్థాయి పెరిగిపోతోంది. అడవుల విస్తీర్ణం తగ్గడం, పట్టణాల్లో పచ్చదనం కుమరుగవడం, పెట్రోలు, డీజిల్ అధికంగా ఉపయోగించడం వల్ల విడుదలయ్యే ఫొటోకెమికల్ కాలుష్యకారకాలు పెరిగిపోతున్నాయి. నైట్రోజన్ ఆక్సైడ్, ఓజోన్ వల్ల ఊపిరితిత్తులు దెబ్బతింటున్నాయి. ఆస్తమా ఏ వయసులోనైనా రావొచ్చు. పెద్దల్లాగే పిల్లలు కూడా బాధపడతారు. స్త్రీలు, పురుషులని తేడా లేదు. దేశంలో సుమారుగా ఐదు కోట్ల మంది ఆస్తమా బాధితులున్నారని అంచనా. నానాటికీ ఈ సంఖ్య పెరుగుతోంది. పర్యావరణ కాలుష్యం వల్ల గ్రామాల కంటే పట్టణాలు, నగరాల్లో ఆస్తమా బాధితులెక్కువ. అయితే ఆస్తమా నివారణకు వీలుకాని జబ్బేమీ కాదు. దీనికి చికిత్స ఉంది. మళ్లీ ఆరోగ్యవంతులయ్యే అవకాశం ఉంది. అలర్జీ ఊపిరితిత్తులకు చేరితే దాన్ని ఆస్తమా అంటారు. అలర్జీ ముక్కులో వుంటే దాన్ని అలర్జిక్ రైనైటిస్ అంటారు. ఆ వివరాల్లోకి వెళితే...

ఊపిరితిత్తులకు ఆక్సిజన్‌ను తీసుకెళ్లే శ్వాసమార్గం (బ్రోంకైల్ ట్యూబులు) ...కావడం లేదా మూసుకుపోవడంతో ఊపిరి తీసుకునేందుకు ఇబ్బందులు ...డమే ఆస్తమా. ఇది మందులతో లేదా దానంతట అదే తగ్గేవీలుంది. శ్వాసకోశ వ్యాధుల్లో, ఇతరత్రా కారణాల వల్ల శ్వాసమార్గం సన్నగా అయ్యే ...ముంది. కండరాల వాపు, బిగుతు వల్ల బ్రోంకైల్ ...లు సన్నబడతాయి. దీంతో అక్కడ మంట ...చ్చు. శ్వాసమార్గాన్ని కఫం అడ్డగిస్తుంది. దీంతో పీల్చుకోవడం ఉంటుంది. ఏదైనా పడని పదార్థాలకు ...గా ప్రతిస్పందిస్తుంది. అలర్జీకి కారణమయ్యే ...ల వల్ల శ్వాస మార్గంలో అవరోధాలు ఏర్పడతాయి. ...పానం, దుమ్ము, వాయుకాలుష్యం, కీటకాలు, బూజు, ...ట్స్ వాసన. సెంట్లు, కొన్ని రకాల పూలవాసనలు... అనేక రకాల పదార్థాలు ఎలర్జీకి దారితీస్తాయి.

డా॥ వ్యాకరణం నాగేశ్వర్
ఇంటర్‌వెన్షనల్ పల్మనాలజిస్ట్
వొక్కార్డ్ హాస్పిటల్స్,
కింగ్‌కోఠి, హైదరాబాద్.
ఫోన్ : 99495 29392

ఇంట్లోనే అలర్జీ, ఆస్తమా కారకాలు

చిన్న చిన్న జాగ్రత్తల వల్ల అలర్జీ, ఆస్తమాను నివారించే అవకాశముంది. ఆ ... ఇంటి నుంచే మొదలు పెట్టాలి. పరుపు, తివాచీలు, దిళ్లు, కర్టెన్లు వంటి ... వీటిని కదిలించేవి వుంటాయి. దిళ్ల కవర్లు, పరుపుపై వేసే దుప్పట్లు, ...ర్నీచర్లలో అలర్జిన్లుంటాయి. పడుకునే ముందు దుప్పట్లు, దిళ్ల కవర్లు ...లి. అయితే వీటిని 55 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద ఉతికితే అలర్జిన్లు ...తాయి. కొన్ని దశాబ్దాలుగా సింథటిక్ దిళ్ల అమ్మకాలు గణనీనయంగా ...యి. ఎందుకంటే ఈ దిళ్ల వల్ల అలర్జీ రాదనే అపోహ ప్రజల్లో నెలకొన్నది.

కానీ ఇటీవల జరిగిన అధ్యయనాలు ఏం చెబుతున్నాయంటే... సింథటిక్ దిళ్ల వల్ల అలర్జీ రాదనేది కేవలం అపోహ మాత్రమే, వాస్తవం కాదని వెల్లడైంది. అయితే దూది దిళ్ల కన్నా సింథటిక్ దిళ్లలోనే ఎక్కువ అలర్జిన్లుంటాయి. ఈ విషయాన్ని అందరూ గమనించాలి. ఇంట్లో పరిచే తివాచీలను కనీసం మూడు గంటలపాటు ఎండలో పెడితే ధూళి కణాలు చనిపోతాయి.

పిల్లల్లోనే ఎక్కువ ఎందుకు?

పిల్లలు ఆస్తమా బారిన పడడానికి ప్రధాన కారణం పిల్లులు, కుక్కపిల్లలతో వీరి సహవాసం. పిల్లులు, కుక్కల బొచ్చులోని అలర్జిన్లు పిల్లలను అలర్జీకి గురిచేస్తాయి. పెంపుడు జంతువులను బెడ్‌రూముల్లోకి, ఇంట్లోకి రానివ్వకూడదు. వాటిని బయట ప్రత్యేకంగా వుంచాలి. ఆస్తమా అని అనుమానం. శ్వాస తీసుకోలేకపోవడం, ఛాతీ పట్టేసినట్లుంచడం, పొడి దగ్గు, పిల్లికూతలు, రాత్రుళ్లు నిద్రపట్టకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే తప్పకుండా లంగ్ ఫంక్షన్ టెస్ట్ (స్పైరోమిట్రి) చేయించాలి. ఈ పరీక్ష ద్వారా శాస్త్రీయంగా ఆస్తమాను గుర్తించే వీలుంది.

30 రోజుల్లోనే...

అలర్జీ-ఆస్తమా చికిత్సలో వినూత్నమైన పద్ధతి అమల్లోకి వచ్చింది. దాని పేరు 'అలర్జిన్ ఐడెంటిఫికేషన్ రికార్డ్' (అలర్జిన్లను గుర్తించే రికార్డు). అంటే 30 రోజుల పాటు రోజూ ఉదయం నుంచి రాత్రి పడుకునే వరకు తీసుకున్న ఆహారం, పళ్లు, నీళ్లు తదితర వివరాలన్నీ ఒక రికార్డులో నోట్ చేయాలి. ఏ ఒక్కటీ వదిలిపెట్టకూడదు. ప్రతిదీ డైరీ రాసినట్లు రాయాలి. ఇలా 30 రోజులయ్యాక రికార్డును డాక్టర్‌కు చూపించాలి. ఎలాంటి ఆహార పదార్థాలు, పానీయాలు తీసుకుంటే అలర్జీ కలుగుతుందో డాక్టర్ వివరిస్తారు. దాని ప్రకారం చికిత్స వుంటుంది.

జీవితకాల అనారోగ్యం

ఆస్తమాలో కొన్ని రకాలు పూర్తిగా తగ్గిపోతాయి. ఓ నిర్దిష్ట వాతావరణమంటే రోగికి ఎలర్జీ అయితే, ఆ స్థలం నుంచి మారడం ద్వారా దాన్ని నివారించొచ్చు. ప్రత్యేకించి వృత్తిపరమైన ఆస్తమాను పూర్తిగా తగ్గించొచ్చు. చిన్నపిల్లల్లో వచ్చే ఆస్తమా తగ్గే అవకాశం కూడా ఎక్కువగా ఉంది. కౌమారదశలోకి వచ్చే సమయంలో హార్మోన్లలో వచ్చే మార్పుల వల్ల బాధపడే పిల్లలు సుమారుగా 70 నుంచి 80 శాతానికి పైగా యుక్తవయస్సు తరువాత ఆస్తమా నుంచి విముక్తి పొందుతారు. మరికొంత మంది అప్పుడప్పుడు మాత్రమే ఆస్తమాతో బాధపడుతుంటారు. మరికొందరికి ఆస్తమా దానంతటదే దూరమవుతుంది. ఆస్తమా ఒకరి నుంచి ఇంకొకరికి అంటుకునే వ్యాధి కాదు. అది శ్వాస మార్గానికి సంబంధించిన అనారోగ్యం తప్ప మరోటి కాదు. ఇన్‌ఫెక్షన్ లేదా అంటువ్యాధి కానే కాదు. అందువల్ల ఇది మరొకరికి వ్యాపిస్తుందనే ప్రశ్నే తలెత్తదు. కొంత మందిలో ఒకేసారి ఆస్తమా లక్షణాలు కనిపిస్తే అది వృత్తిపరమైన ఆస్తమా అయి ఉంటుంది. ఆస్తమా ఉన్న పిల్లలతో మిగిలిన పిల్లలు ఆడుకోకుండా నిరోధించొద్దు. అదేమాత్రం అంటువ్యాధి కాదు. ఇందులో కొంత నిజం ఉంది. కొంత మందిలో ఏదో ఒక మూలన వంశపారంపర్య లక్షణాలు బయటపడినంత మాత్రాన అది వంశపారంపర్య లక్షణంగా వచ్చిందనీ చెప్పలేం. నిజానికి తల్లిదండ్రుల జీవనశైలి పిల్లల ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేయొచ్చు. తలుపులు మూసుకుని ఉండడం, ఎయిర్ కండిషనర్లు, ధూమపానం చేసేవారి పక్కన ఉండడం లాంటివి పిల్లల సున్నిత శ్వాసకోశాలను యాంటిజెన్లతో నింపొచ్చు. అది ఆస్తమా వచ్చే అవకాశాలను పెంచుతుంది. ★

బీర్బల్ కథలు

చందమామ-2

మిగతా వచ్చేవారం...

జవాబులు

ఐదుతో నాలుగు? :



త్రిభుజం ఎక్కడ?



చేసి చూద్దాం...



ఎలా? :





ఐదుతో నాలు

హాయ్... అగ్గిపుల్లలతో చేసిన ఐదు
పైన ఉన్నాయ్. వీటిలో ఎక్కడ్నుండైనా
తీసి వేరే ప్రదేశంలో పెట్టి నాలుగు బాక్సు



త్రిభుజం ఎక

హాయ్ చిన్నారులూ... ఈ ము
కలిపి ఒక త్రిభుజంగా చేయ



చేసి చూద్దా

హాయ్ ఫ్రెండ్స్... ఈ ఆరు పెన్సిళ్ల
త్రిభుజాలు తయారు చేస్తారా?
వీటికితోడు మరొక చిన్న
ఉపయోగించుకోవచ్చు. చేసి చ

కలిపేద్దాం

హాయ్ పిల్లలూ.. కింద ఏదో ఆకారం కనిపిస్తోంది కదూ.
ఆ చుక్కలన్నింటినీ కలిపేసి అదేంటో చూద్దామా.



బాలనేస్తాలు

నేర్చుకుందాం





ఎవరికి ఎవరు?

పిల్లలూ ఇక్కడున్న అందరూ పక్క పక్కన లేరు కానీ కవలలే.
మీరు వారిని గుర్తించి ఎవరికి ఎవరో జత చేయండే.

ఎలా ?

హాలో... ఇక్కడ మొత్తం ఎనిమిది పుల్లలున్నాయి.
వీటితో నాలుగు చతురస్రాలు చేయాలి. ఎలాగబ్బా!



కథ చెప్తే ఊ... కొడతారా!

- కె.అంజన

ఆకాశంలో పిండారబోసినట్టు పండు వెన్నెల. అప్పుడప్పుడు వచ్చి చల్లగా పలుకరించి వెళ్లే చిరుగాలి. ఆరుబయట వరుసగా వేసిన మంచాలు. అమ్మమ్మ రాకకోసం వెయ్యికళ్లతో ఎదురుచూసే చిన్నారులు. ఉదయం నుంచి ప్రియాతిప్రియమైన మనవళ్లు, మనవరాళ్లకు ఇష్టమైన వంటకాలు చేసిపెట్టడంలో తీరిక లేకుండా వున్న ఆమె... పని ముగించుకొని చేతులు తుడుచుకొని వస్తుండగానే ...పరుగు పరుగున వెళ్లి చేతులు పట్టుకుని తీసుకొచ్చే పిల్లలు. తర్వాత అమ్మమ్మ పక్కన వెచ్చగా పండుకొని ఆమె చెప్పే కథలు వింటూ...ఊ కొడుతూ... నిద్రలోకి జారుకునే దృశ్యం మెల్లగా అస్పష్టమౌతోందా అనిపిస్తోంది.

కథలు చెప్పడం ఎందుకు తగ్గిపోతోంది? అసలు పిల్లలకు కథలు ఎందుకు చెప్పాలి? ప్రయోజనాలేంటి? కథ ఎప్పుడు పుట్టింది? ఎన్ని రకాల కథలున్నాయి? కథ ఎలా, ఎప్పుడు చెప్పాలి? వంటి వివరాలు వేసవి సెలవుల సందర్భంగా ప్రత్యేకంగా..

కథ మనిషిని ఏడు సంద్రాల ఆవలకు తీసుకెళుతుంది. మాట్లాడే చిలుక గురించి చెప్తుంది. పిల్లలను పట్టుకెళ్లే ఒంటి కన్ను బ్రహ్మ రాక్షసిని చూపిస్తుంది. మంత్రాల మర్రి మానును పరిచయం చేస్తుంది. మహామహా ఎత్తులను కూడా తన జిత్తులతో చిత్తు చేసే నక్కమామతో స్నేహం కలుపుతుంది. అనుకున్నది సాధించడానికి ఎన్ని కష్టాలు పడడానికైనా సిద్ధం అవమంటుంది. అలాంటి కథలు చెప్పడం ఇప్పుడు ఎందుకు తగ్గుతోందబ్బా...

మారిన కాలం

'అమ్మా కథ చెప్పవూ...!' అని పిల్లలు గారాంగా నోరు తెరిచి అడిగారే అనుకోండి...

'నాన్నా! ఇంకా పని కాలేదురా...'

'ఇవాళ ఆఫీసులో పని ఎక్కువగా వుండి నీరసంగా వుందమ్మా. రేపు చెప్తాలే'

'ఏం కథ చెప్పాలి? సమయానికి గుర్తొచ్చి చావడంలేదే?'

వంటి ఎన్నో రకాల సమాధానాలు చిన్నారులను నిరాశపరుస్తాయి. ఇలా వరుసగా జరిగితే ఆ చిన్నారులు మరి అడుగుతారా! ఊహూ. వాళ్లు కూడా పెద్దల సరసన టీవీలకు అతుక్కుపోతారు. ఎందుకిలా అవుతోంది? అమాయకంగా కథ చెప్పమని అడిగే పిల్లలకు కథ ఎందుకు చెప్పలేకపోతున్నామంటే...బిజీ బిజీ. బిజీ లైఫ్ కారణమంటారు. పెద్ద కుటుంబాలు విచ్ఛిన్నం కావడం ... బతుకు పోరులో భాగంగా పల్లెల నుంచి పట్టణాలకు వలస రావడం...ఉదయం లేచింది మొదలు నాలుగు మెతుకులు వండిపడేసి ఉద్యోగాలకు పరుగు తీయాల్సి రావడం..... పొద్దంతా పనిచేసి తిరిగి బస్సుల్లో పడి వచ్చేసరికి అలసి పోవడం...మళ్లీ సాయంత్రం వంట ఏర్పాట్లు...ఇలా ఎన్నో కారణాలు వుంటాయి. పిల్లలు మాత్రం తీరిగ్గా వుంటున్నారా? వాళ్లూ యమా బిజీ. పొద్దున్నే ట్యూషన్. తర్వాత స్కూల్. వచ్చేక మళ్లీ ట్యూషన్. హోంవర్క్. అదనపు కోచింగ్‌లు...ఇంకా ఏమైనా సమయం మిగిలితే టీవీలు, వీడియో గేమ్స్ వుండనే వున్నాయి. ఇంక కథ చెప్పే వారెవరు? విని ఊ కొట్టే వారెవరు? కానీ పిల్లలకు కథ చెప్తామంటే మాత్రం టీవీలు, వీడియో గేమ్స్ మూలకు విసిరేసి రారూ ఊ కొట్టడానికి.



ఎన్ని లాభాలో...

నడతను మార్చే కథలు: ఇదివరలో పిల్లలను నిద్ర పుచ్చడానికో, అన్నం తిననని మారాం చేస్తే తినిపించడానికో అమ్మమ్మ, తాతయ్యలు కథలు చెప్పేవారు. వాటి వల్ల లాభాలు అన్నీ ఇన్నీ కావని తెలిస్తే ఎవరు మాత్రం కథలు చెప్పకుండా వుంటారు చెప్పండి! కథల ద్వారా పిల్లలకు మంచి చెడులు తెలుస్తాయి. బంగారం లాంటి భాష, సంభాషణా చాతుర్యం, ఎత్తులు పైఎత్తులు, లోకజ్ఞానం, నడతను, నడకను నేర్పేవి కథలు.

తర్కం-జ్ఞాపకశక్తి

కథలు పిల్లల్లో తర్కాన్ని పెంచుతాయి. జ్ఞాపకశక్తిని వృద్ధి చేస్తాయి. ఏడుచేపల కథే చూడండి. 'అనగనగా ఒక రాజు' అంటూ మొదలై...'రాజుకు ఏడుగురు కొడుకులు. ఏడుగురూ వేటకెళ్లి ఏడు చేపలు తెచ్చి ఎండబెట్టారు. అందులో ఒక చేప ఎండలేదు. చేపా చేపా ఎందుకెండలేదు?' ...అంటూ సాగే కథ వినని పిల్లలుండరంటే అతిశయోక్తి కాదు. అది హిమాలయాలంత పాతది. ముని మనవణ్ణో, మనవణ్ణో, ముని మనవరాలినో ఒళ్లో కూర్చోబెట్టుకొని కొన్ని వేల సంవత్సరాలుగా ముత్తాతలు, జేజెమ్మలు, తాతయ్యలు, అమ్మమ్మలు, నానమ్మలు ఈ కథ చెప్తున్నారు. కథల్లో కొన్ని పదాలు, పేర్లు పునరావృతం కావడం, ప్రశ్నించడం, వాటిని తిరిగి అదే క్రమంలో గుర్తుకుతెచ్చుకోవాల్సి రావడం వంటివన్నీ పిల్లల్లో తర్కాన్ని, జ్ఞాపకశక్తిని పెంచుతాయి. ఇది భవిష్యత్తులో పిల్లల చదువుకు, కెరీర్‌కు ఎంతగానో ఉపయోగపడతాయి.

మధురానుభూతి

కథలు చెప్పకపోవడం పూర్తిగా పెద్దల తప్పిదమే. పావుగంటో, అర్థగంటో పిల్లల పక్కన కూర్చుని వారి కళ్లల్లోకి చూస్తూ...ఆప్యాయంగా వారి భుజం తడుతూ, తల వెంట్రుకలు సరిచేస్తూ కథలు చెప్పడం అనేది పిల్లలకే కాక



పెద్దలకు కూడా ఒక విధమైన ఆత్మీయానుబంధాన్ని పెంచుతుంది. కథలు చెప్పడం, వినడం తల్లీబిడ్డలకు ఒక మధురమైన అనుభూతి. తల్లిదండ్రుల్లో ఎవరోఒకరు ఈ బాధ్యతను తీసుకోవాలి. పిల్లల వయసుతోపాటు వారి కథల ప్రపంచాన్ని విస్తృతం చేసుకుంటూ పోవాలి. వారంతట వారు చదవగలిగే వయసు వచ్చినా పక్కన పెద్దలు ఎవరోఒకరుండాలి. ఒంటరిగా వదిలేస్తే ఆసక్తిపోతుంది. అదే పెద్దలు పక్కనుంటే వారికి వచ్చే సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేయవచ్చు. పైగా కథలోని నీతి గురించి చర్చించే అవకాశం కూడా పెద్దలకు వస్తుంది. పరోక్షంగా వారికి విలువల గురించి నేర్పడానికి ఇదో మంచి మాధ్యమం. పైగా కథ గురించి జరిగే చర్చవల్ల పిల్లలకు పెద్దలకు మధ్య చక్కని అనుబంధం ఏర్పడుతుంది. ఇదో తీపి జ్ఞాపకంగా మనోఫలకాలపై అలా ముద్రపడిపోతుంది.

భాష నేర్పుతుంది

భాష నేర్పడానికి, నేర్చుకోవడానికి గొప్ప సాధనం కథ. పెద్దలు చెప్పే కథల్లో...లోక జ్ఞానం నుంచి, జీవితానుభవం నుంచి పుట్టుకొచ్చే సరళమైన భాష పిల్లలను ఆకట్టుకుంటుంది. ఫలితంగా వారికి చక్కటి భాష అలవడుతుంది. పదజాలం పెరుగుతుంది. ఇతరులతో ఎలా మాట్లాడాలో? తమ మనసులోని మాటను ఎదుటి వారికి అర్థమయ్యేలా ఎలా చెప్పాలో తెలియచేస్తుంది. ఇవన్నీ వారి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరం.

మంచి వ్యక్తిత్వం

చిన్నారులు వినే కథల్లో ఎప్పుడూ మంచి చెడు వుంటాయి. ఎక్కువశాతం మంచిదే పైచేయి అవుతుంది. పిల్లలు కూడా తమకు తెలీకుండానే మంచి పట్ల, మంచి కోరే, మంచి చేసే కథానాయకుడి పట్ల ఆకర్షితులౌతారు. తాము కూడా అలాగే వుండాలనుకుంటారు. అలా వారికి మంచిచెడులు తెలుస్తాయి. ఏది చేయొచ్చో...ఏది చేయకూడదో తెలుస్తుంది. మొత్తం మీద వారికి మంచి వ్యక్తిత్వం అలవడుతుంది.

ప్రశ్నించడం

కథ చెప్తూనే మధ్యలో ఆపి...అలా ఎందుకు జరిగింది? ఇప్పుడు రాజుకేమౌతుంది? యువరాజు మంత్రాల మామిడిపండును సంపాదించి యువరాణిని కాపాడతాడా? అసలు ఇప్పుడు దొంగల బారి నుంచి బయటపడడమెలా? వంటి ప్రశ్నలు వేస్తూ...సమాధానాలు చెప్పిస్తుంటే వారికి ఊహ, ఆలోచన, సృజన పెరుగుతుంది. తర్వాత్తర్వాత వారు కూడా కథలో అలా ఎందుకు జరగకూడదు? ఇలా



కథ పుట్టుక

కథ చెబుతాను 'ఊ' కొడతావా? అన్న మాట వినకుండా ఐదవ సంవత్సరం దాటని పిల్లలు వుండరంటే అతిశయోక్తి కాదు. ప్రపంచంలో వున్న అన్ని భాషల వాళ్లు కథలు చెప్తారు. కథలు రాస్తారు. అసలు కథలంటే చెవి కోసుకోని పిల్లలుంటారా చెప్పండి? అంతటి ఇష్టాన్ని పసిబిడ్డనుంచి పళ్లూడిన ముదుసలి వరకు కలిగించే ఈ ప్రక్రియ ఎప్పుడు ఎలా పుట్టింది? అంటే స్పష్టంగా ఎవరూ చెప్పలేరు. మనిషి ఆయుష్షు నూరేళ్లే! కానీ కథ ఆయుష్షు కొన్ని లక్షల సంవత్సరాలు! ఏనాడు పుట్టిందో తెలియని కథ నేటికీ సమాజాన్ని ఆనందపరుస్తోంది. ఆశ్చర్యపరుస్తోంది. విజ్ఞానాన్ని అందిస్తోంది. అక్షరం పుట్టకముందు ఇంకా చెప్పాలంటే భాష పుట్టక ముందే కథ పుట్టింది. ఆదిమ కాలంలో స్త్రీలు, పురుషులు కూడా వేటకు వెళ్లేవారు. పులినో, ఎలుగునో, ఎనుబోతునో వేటాడేవారు. అది ఒక సాహసకృత్యం. అది చేసిన వారు, దాన్ని చూడనివారికి, గుహలోనే వుండిపోయినవాళ్లకు వివరించి చెప్పే ప్రయత్నమే కథగా అవతరించింది. వున్నది వున్నట్టుగా చెబితే అది కథ కాదు. కొంత వాస్తవం, కొంత కల్పన, కొంత అతిశయోక్తి కలిపి చెప్పే తాపత్రయం మారుపేరే కథ. ఒక్క వాక్యంలో చెప్పుకోవాలంటే...మానవుని ఊహ ఏనాడు రెక్క విప్పుకున్నదో ఆనాడే పుట్టింది కథ. కాదేది కథకనర్హం. జగత్తు మొత్తం కథగా మారింది. చెట్టుకథ, పుట్ట కథ, గుట్ట కథ, రట్టు కథ, బెట్టు కథ, తిట్టు కథ, పిట్ట కథ... ఇలా పుంఖానుపుంఖాలుగా కథలు పుట్టుకొచ్చాయి. ప్రకృతిలో తనకు అర్థంకాని ప్రతి విషయాన్ని గురించి మానవుడి మస్తిష్కం రకరకాల ఊహలు చేసి, ఆ ఊహలకు ఊపిరిపోసి, ఆ ఊపిరికి అక్షరరూపం ఇస్తే మన హృదయాలలో రూపుదిద్దుకున్నదే అచ్చమైన కథ.

జరిగితే బావుండేది కదా! అని అడగడం మొదలెడతారు. ఇది వారిలో ప్రశ్నించే స్వభావాన్ని, ఊహాశక్తిని పెంచుతుంది.

నీతి-విలువలు

ప్రతి కథలోనూ నీతి వుంటుంది. అది లేకుండా అస్సలు కథే వుండదు. పిల్లలకు వాటి గురించి కూడా స్పష్టంగా అర్థమయ్యేలా చెప్పాలి. ఉదాహరణకు పొద్దస్తమానం పోట్లాడుకునే పిల్లులు 'షిరో కురో' కథ చెప్పామనుకోండి. ఎప్పుడూ పోట్లాడుకుంటే నష్టపోతాం. అదే చక్కగా కలిసి వుంటే ఇన్ని లాభాలున్నాయని వారికి తెలుస్తుంది. అసలు కథల ద్వారానే మనుషులు ఎలా ప్రవర్తిస్తారు? ప్రవర్తించాలి? వంటివి తెలుస్తాయి. వాస్తవానికి నీతి, విలువలను పసివయసులో పిల్లలకు అర్థమయ్యేలా చెప్పడం కష్టమైన పని. అదే కథల రూపంలో అయితే చక్కగా చెప్పొచ్చు.

ధైర్యసాహసాలు

కథల్లో రాక్షసుల్ని సైతం అమాంతంగా చంపేసే సామాన్యులు, భయపెట్టే పులుల్ని కూడా మట్టి కరిపించే కథానాయకులు వారి సాహసకృత్యాలు పిల్లలను ఇట్టే ఆకట్టుకుంటాయి. ఏదైనా ఆపద వచ్చినా తెలివితేటలతో, ధైర్యసాహసాలతో ఎలా ఎదుర్కోవాలో తెలియచెప్తాయి.

వ్యక్తిగత పరిశుభ్రత

పిల్లలకు వ్యక్తిగత - పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం గురించి అవగాహన కలిగించే విషయాలను యథాతథంగా చెప్తే వారు అంతగా ఎక్కించుకోరు. అదే కథలద్వారా అయితే చక్కగా వింటారు. అవలంభిస్తారు కూడా. ఒకవేళ పాటించకపోతే...అదిగో ఆ కథలో టింకూ ఏం చేశాడు? ఎంత శుభ్రంగా వుండేవాడు? అంటూ గుర్తు చేస్తే చాలు. ఫాలో అయిపోతారు.

వినోదం-విజ్ఞానం

అసలు కథల నుంచి అందే విజ్ఞానం, వినోదం అంతా ఇంతా కాదు కదా. ఎంత హాస్యం వుంటుంది వాటిలో. అవన్నీ కథలు వినే పిల్లల్నే కాక చెప్పే పెద్దలను కూడా చక్కగా మనసారా నవ్వుకునేలా ఆస్వాదించేలా చేస్తాయి. టెన్షన్‌ను ఇట్టే మాయం చేస్తాయి.

మానవత్వం

ఆపదలో, కష్టాల్లో వున్నవారిని ఆదుకోవడం, చేతనైన సాయం చేయడం వంటి మానవీయ లక్షణాలను అలవర్చే గొప్ప మాధ్యమం కథే.

ఎలా చెప్పాలి?

కథ ఏదైనా సరే...అందంగా, అనుభూతిని కలిగించేలా చెప్పాలి. ఊరిస్తూ చెప్పాలి. మాటల్లో అందం. వర్ణనలో అందం. వివరణలో అందం. మౌనంలో అందం. పాత్ర చిత్రణలో అందం, సన్నివేశ కల్పనలో అందం, ఎత్తుగడలో అందం. నడకలో అందం. ముగింపులో అందం తొణికిసలాడాలి. తర్వాత ఏమౌతుందబ్బా...అనిపించాలి. కథ వినే చిన్నారులు కదలమెదలకుండా కథ



ఆసాంతం వినాలి. కథ సరళంగా, మనోహరంగా వుండాలి. సందర్భాన్నిబట్టి కథ చెప్పేవారి స్వరంలో హెచ్చుతగ్గులు రావాలి. అప్పుడప్పుడు నటనను కూడా జోడించాలి. మొత్తంమీద సులభంగా అర్థమయ్యేలా, ఆకర్షణీయంగా చెప్పాలి. అలా కథలు వింటూ హాయిగా నిద్రలోకి జారుకోవాలి చిన్నారులు.

ఏం చెప్పాలి?

కథలు పిల్లల మెదడులో కొన్ని మౌలికమైన భావాలను బలంగా నాటుతాయి. ధైర్య సాహసాలూ, నిజాయితీ, స్నేహ పాత్రత, త్యాగబుద్ధీ, కార్యదీక్షా, న్యాయమూ మొదలైనవి జయించడం ద్వారా సంతృప్తిని కలిగించే కథలు ఎంత అవాస్తవంగా వున్నా పిల్లల మనస్సులకు మేలు చేస్తాయి. దురాశా, ఓర్వలేని తనం, అధికార గర్వమూ, క్రూరత్వమూ, కృతఘ్నతా, అధర్మమూ, స్వార్థమూ వంటివి శిక్షించబడడం కూడా పిల్లలకు తృప్తినివ్వాలి. కొన్ని కొన్ని సద్గుణాలు ఒక్కొక్క సమయంలో దౌర్బల్యంగా పరిణమించడమూ ప్రమాదం తెచ్చిపెట్టడమూ జరుగుతుంది. భూత దయ చాలా మంచిది. నిస్సహాయుల పట్ల జాలి చూపడం వరకు ఇబ్బంది లేదు. కానీ దుర్మార్గుల పట్ల చూపే దయ ప్రమాదాలకు దారి తీస్తుంది. అందుచేతనే బోను నుంచి పులిని విడిపించిన బ్రాహ్మడి కథలో ముఖ్యాంశం బ్రాహ్మడి జాలి కాదు. అది తెచ్చిపెట్టిన ప్రమాదమే. ఆ ప్రమాదాన్ని నక్క యుక్తిగా తప్పిస్తుంది. రాక్షసులను మనుషులు జయించడమూ ధనికులను వాళ్ల సేవకులు భంగపరచడమూ అతి సామాన్యమైన వ్యక్తులకు అసాధారణ శక్తులుండడమూ లేదా వారికి అవి లభ్యం కావడమూ వంటి జానపద కథలు ప్రపంచమంతటా వున్నాయి. వాస్తవ సాంప్రదాయాలకు ఎదురువెళ్లే ఈ కథలు పిల్లలకు దొంగల భయమూ, దయ్యాల భయమూ తగ్గిస్తాయి. దేవుడి మీద భక్తి, మతవిశ్వాసాలూ నిండిన కథలు పిల్లలకు చెప్పడం మంచిదికాదు. కథల్లో దేవతలూ, భక్తులూ వుండకూడదని కాదు. దేవుణ్ణి నమ్ముకుంటే అన్ని సుఖాలూ అందుతాయని పెద్దలు అనుకోవడం ఎంత తప్పో, దాన్ని పిల్లలకు చెప్పడం అంతకు పదింతల తప్పు. కథల్లో నెగ్గవలసింది మానవ ప్రయత్నమూ, మనిషి సద్బుద్ధీ. ఇది చాలా ముఖ్యం. కథలోని పాత్రలు చాలా మంచివాళ్లైనా కావాలి, చాలా చెడ్డవాళ్లైనా కావాలి. చాలా తెలివిగలవాళ్లైనా కావాలి. వట్టి మూర్ఖులైనా కావాలి. ఇవి చిన్నారులకు విజ్ఞానం, వినోదం అందించి వారి వికాసానికి చక్కగా తోడ్పడతాయిమరి.

మళ్లీ మొదలెడదాం!

బిజీలైఫ్ అనీ అదనీ ఇదనీ ఎన్ని కారణాలున్నా... మళ్లీ చిన్నారులకు కథలు చెప్పడం మొదలెడదాం. కథలు వింటూ ఊ కొట్టే వారి కళ్లల్లో ఎన్ని మెరుపులు కనిపిస్తాయో చూడండి. అది చూడ్డానికే కదా మనం ఎంత కష్టపడ్డా. అలాంటి అవకాశాన్ని వదులుకుంటామా ఏంటి?! అందుకే 'కథ చెప్తాం ఊ...కొడతారా?' అని అడిగి చూడండి. వారి అమాయకపు కళ్లల్లో ఎంత సంతోషమో గమనించండి.

★

ఎన్ని కథలో....

అబ్బ ఎన్ని కథలున్నాయో! వాటిలో మనం విన్నవి సముద్రంలో బిందువంతే. పౌరాణిక కథలు, జానపద కథలు, చారిత్రక కథలు, సాంఘిక కథలు అసలు ఎన్ని వున్నాయో కదా. పురాణాల నుంచి చెప్పుకునే కథలు పౌరాణిక కథలు. చరిత్రలో వీరులు, శూరులుగా ప్రసిద్ధి చెందిన వారి గురించి చెప్పుకునే కథలు చారిత్రక కథలు. ఇక జానపద కథల్లో మనుషులు, దేవతలు, దెయ్యాలు, జంతువులు అన్నీ పాత్రలే. మనకు పద్నాలుగు లోకాలుంటే జానపద కథల్లో స్వర్గం, పాతాళం, భూలోకం ఎక్కువగా చోటు చేసుకుంటాయి. ఉత్కంఠ, విస్మయం ప్రధాన లక్షణాలుగా కనిపిస్తాయి. గాల్లో ఎగిరే గుర్రాలు - చాపలు, చెప్పులు వేసుకుంటే మనుషులు కనిపించకుండా పోవడం, ఈ నాటి దూరదర్శనయంత్రాల్లాంటి అద్దాలు, ఆ అద్దాల్లో మాంత్రికుడికి కావలసిన రాజకుమార్తె కనిపించడం, ఆకు పసరు పూసుకుని మాయమైపోవడం వంటి విచిత్ర సన్నివేశాలు అడుగడుగున కనిపిస్తాయి. సాధారణంగా ఇవి అనగనగా ఒక ఊళ్లో అనో, అనగనగా ఒక పేదరాశి పెద్దమ్మ వుందనో, అనగనగా ఒక భూతం వుందనో అనగనగా ఒక రోజు అనో ప్రారంభించి కథ కంచికి మనం ఇంటికి ఇక పడుకో అని ముగిస్తుంటాం. సాంఘిక కథల విషయానికొద్దాం. మన చుట్టూ వున్న సమస్యలు, ఈతిబాధలు... వాటి పరిష్కారాలకు సంబంధించినవి.

చూద్దామా

అలనాటి వైభవ చిహ్నం అలహాబాద్

నగిషీలు చెక్కిన పాతమేడలు, మురికివాడలు, ఊరిబైట కొత్తగా వెలిసిన కాలనీలు. పాత వూరిలో కూడా అలహాబాదు యూనివర్సిటీ వైపు ఒకనాటి దర్పం, వైభవం చెక్కుచెదర్లేదు. విశాలమైన ఆవరణలతో నిర్మించిన పెద్ద భవంతులు ఈనాటికీ చెక్కుచెదరలేదు. విశ్వవిద్యాలయానికి ఎదురుగానే నెహ్రూల స్వగృహం ఆనందభవన్ ఉంది. ఇక్కడి టాంగాలు ఒక ప్రత్యేక తరహాలో ఉంటాయి. ఒక చెక్క బల్లమీద నగిషీలు చెక్కిన రథంలా ఉంటుంది. దీన్ని ఒంటెలు లాగుతాయి. ఈ ఒంటెలను 'ఇక్కా' అంటారు. బండి కాడి ఒంటె మెడ దాకా లేచి చిత్రంగా ఉంటుంది. వీటిలో ముస్లింలు ప్రయాణిస్తుంటే చుట్టూ తెరలు కడ్తారు. ఇక్కడ సరుకులు, కూరగాయలు మోసుకెళ్లే బళ్లను కూడా ఒంటెలే లాగుతాయి.

ఇక్కడ త్రివేణీసంగమాన్ని అందరూ సంగమ్ అంటారు. ఎదురెదురుగా వచ్చిన గంగాయమునలు మూడోవైపుకు ప్రవహిస్తాయి. మూడవది సరస్వతి. కానీ ఇప్పుడా నది లేదు. కనిపించదు. గుప్తంగా ప్రవహిస్తుందని ప్రజల నమ్మకం. మన ప్రాచీన వాఙ్మయం ఆవిర్భవించినది ఈ నదీ తీరానే. ప్రముఖంగా వ్యాసుని భాగవత మహా పురాణం ఋషిగణాల తపస్సులతో పవిత్రమైన భూమి ఈ సరస్వతీనది తీరం. ఈమధ్య ఉపగ్రహాల ద్వారా ఈనదీ మార్గాన్ని గుర్తించారు. అంతర్వాహినిగా ప్రవహించడం వల్ల గంగ, యమున, సరస్వతి నదులు ఇక్కడ సంగమిస్తాయి. అందుకే దీన్ని త్రివేణీసంగమం అంటారు. గంగానది ఒక పాయలా ఉన్నప్పటికీ చాలా ఉధృతంగా సుడులు తిరుగుతూ ప్రవహిస్తుంది. రెండవవైపునుండి నీలిరంగు నీటితో మందగమనంతో ప్రవహిస్తుంది యమున. ఎందరు మహర్షులు, భక్తులూ ఈసంగమతీరాన్ని పావనం చేశారో? ఎంతటి ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరిసిందో?

ఆనందభవన్

ఇది జవహర్‌లాల్ నెహ్రూ తండ్రి మోతీలాల్‌నెహ్రూ నిర్మించుకున్న స్వగృహం. సువిశాలమైన ఆవరణలో ఎత్తైన పునాదిమీద చక్కని వాస్తుశిల్పంతో ఆనందభవన్ కన్పిస్తుంది. ఆనాటి శ్రీమంతుల విలాసజీవన సరళికి ప్రతిరూపం ఇది. ఇదంతా కూడా వారి స్వాతంత్ర్య పోరాటానికి చెల్లిపోయింది. ఆపోరాటంలో అనేక ఘట్టాలు ఈ భవనంతో పెనవేసుకుపోయాయి. భారత దేశ చరిత్రలో సుస్థిరమైన స్థానాన్ని అధిరోహించిన మహామనిషికి మానవుని త్యాగనిరతికి సాక్షీభూతంగా ఈనాటికీ తన జ్ఞాపకాలను వెదజల్లుతూ గంభీరంగా, సౌందర్యం ఒలకబోస్తూ మనల్ని ఆహ్వానిస్తుంది. దీన్నిప్పుడు నెహ్రూ మ్యూజియంగా మార్చారు. చుట్టూ సువిశాలమైన లాన్స్, మధ్యలో ఆనందభవన్ తీర్చిదిద్దినట్లుగా ఉంటుంది.

పై అంతస్థులో మొదటి గది జవహర్‌లాల్ నెహ్రూది. ఆయన హీరో పబ్లిక్ స్కూల్లో చదువుకున్నపుటి పరీక్ష పేపర్లు, ఫోటోలు ఆ గదిలో చూడవచ్చు. మరో గదిలో ఆయన పాదరక్షలు, స్వాతంత్ర్యపోరాటంలో తుపాకీ కాల్పులకు గురైనవారి శరీరాలనుండి తీసిన తుపాకీ గుళ్లు, అహ్మద్‌నగర్‌కోటలో ఆయన జైలుజీవితం గడిపినప్పుడు సేకరించిన వస్తువులు ఉన్నాయి. గాంధీజీకి, మోతీలాల్‌కు మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా ఇక్కడ చూడవచ్చు. తరువాత గదిలో జవహర్‌లాల్ నెహ్రూ పడక, గ్రంథాలయం, దీని వెనుకే ఇందిరాగాంధీ పడకగది, ఆపక్కన వారి పడకగదులు ఉన్నాయి. ముందు పోర్టికో వైపున్న ఒక గదిలో అప్పటి కాంగ్రెస్ అగ్రనాయకుల సమావేశాలు జరుగుతుండేవట. ఇక్కడ పెద్ద గ్రంథాలయం కూడా ఉంది. అందులో ఆనాటి సమావేశాల ఫోటోలు అమర్చారు. దేశచరిత్రను నిర్దేశించిన సాహసోపేతమైన నిర్ణయాలెన్నో ఇక్కడే జరిగాయి. పోర్టికో పైనున్న ఖాళీ ప్రదేశంలో గాంధీజీ నూలు వడుకుతూ సన్నిహితులతో పోరాటవిధానానికి రూపకల్పన చేసేవారట. ఇక్కడ గాంధీజీకి కూడా ఒగది ఉంది. ఇక్కడే ఇందిర, ఫిరోజ్‌గాంధీల వివాహం జరిగింది.

కుంభమేళా

పన్నెండు సంవత్సరాలకొకసారి కుంభమేళా ఉత్సవం జరుగుతుంది. ఆ సమయంలో ఇక్కడ స్నానం సర్వపాపహారిణి అని హిందువుల ప్రగాఢవిశ్వాసం. దేశం నలుమూలలనుండీ ఈ సమయంలో అనేకమంది ప్రజలతో ప్రయాగ

ఆనందభవన్


త్రివేణీసంగమం



అక్బరుకోట



కుంభమేళా

నిండిపోతుంది. ఆ సమయంలో రోజూ ఐదారు లక్షలమంది స్నానాలు చేస్తారు. సుమారు ఐదువేలమంది ప్రభుత్వ సిబ్బంది ఇక్కడి ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. గంగానదీ తీరమంతా మూడు కిలోమీటర్ల పొడవునా కొన్ని వందల డేరాలు వేస్తారు. గంగ ఈ సమయంలో బురదగా మారిపోతుంది కనుక నదీతీరమంతా ఇనుమ రేకులు పరుస్తారు. వీధుల్లోనూ, డేరాల్లోనూ విద్యుద్దీపాలు ఏర్పాటుచేస్తారు. ప్రతీచోటా మంచినీటి సౌకర్యం కల్పిస్తారు. పెద్ద వీధులకు రెండువైపులా రకరకాల దుకాణాలు, హోటళ్లు, ఖాదీభండార్ నుండి రిబ్బన్లు వరకూ అక్కడ దొరుకుతాయి.

కుంభమేళా పుష్యపౌర్ణమినుండి మాఘపౌర్ణమి వరకూ నెలరోజులు జరుగుతుంది. ఇక్కడ యాత్రికులకు నామమాత్రపు ఖర్చుతో సాధువులు భోజనం ఏర్పాటుచేస్తారు. చిన్న చిన్న పందిళ్లువేసి భజన కార్యక్రమాలు, బోధనలు కూడా చేస్తారు. వారి నివాసం కూడా అక్కడే. ఇక్కడ యాచకులు కూడా వేలసంఖ్యలో ఉంటారు. ఇక్కడ కన్యాకుమారిలోని వివేకానందుని స్మారకమందిరం ఫోటో కూడా ఉంది.

అక్బరుకోట

ఇది యమునకు ఆవలి గట్టున అక్బరు నిర్మించిన దుర్గం. ఇది చాలా పెద్దది. ఇక్కడ వటవృక్షాన్ని 'అక్షయవట్' అంటారు. అంటే ఇది చిరంజీవి అన్నమాట.

భరద్వాజ ఆశ్రమం

ఇది ఆనందభవన్ సమీపంలో ఉంది. త్రేతాయుగపు నాటి పుణ్యవాటిక, త్రివేణీసంగమం వద్దనున్న భరద్వాజాశ్రమం రామునికి, భరతునికి ఆతిథ్యమిచ్చిన ఆశ్రమం, శిథిలాల్లోనున్న ఆశ్రమాలను గుర్తించి బిర్లాలు ఇప్పుడున్న మందిరాలను నిర్మించారు. లోపల భరద్వాజుని విగ్రహం, శివలింగం ఉన్నాయి. ఒక పక్కనుండి లోపలకు దిగితే గుహవలె ఉన్న ప్రదేశంలో యజ్ఞవల్క్య మహాముని ఉండేవారట. ఇప్పుడు అక్కడ ఆయన విగ్రహం ఉంది. అప్పట్లో ఇదంతా అరణ్యప్రాంతం. ప్రయాగ దర్శనానికి వచ్చిన మహర్షులు భరద్వాజాశ్రమాన్ని దర్శించేవారు.

ఇక్కడ ప్రయాగను గురించి ఒక్కమాట చెప్పుకోవాలి. ఇది ఒకప్పుడు చంద్రవంశపు రాజుల రాజధాని. పేరు ప్రతిష్ఠానపురం. ఇదే కాలానుగుణంగా ప్రయాగగా మారింది. అని చెప్తారు. ఈ చంద్రవంశీయులలో ముఖ్యులు కేశవులు. తరువాత వారి రాజధానిని హస్తినాపురానికి మార్చుకున్నారు. హస్తినాపురం మీరట్ సమీపంలో ఉంది.

ఆల్‌ఫ్రెడ్ పార్కు

గాంధీజీ తను ప్రారంభించిన సహాయనిరాకరణోద్యమం మంచి ఊపందుకుంటున్న సమయాన హఠాత్తుగా నిలిపివేశారు. కొందరు హింసాత్మక చర్యలకు పాల్పడటంవల్ల ఆయన ఆవేదన చెంది తన పోరాటానికి మౌలికమైన అహింసను ప్రజలింకా ఆకళింపు చేసుకోలేదన్న వ్యథతో అలా చేశారు. ఇలా ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమాన్ని ఆకస్మికంగా నిలిపివేయడం గ్రహించలేని యువకులు కొందరు కాన్పూరులో సమావేశమై హిందుస్థానీ రిపబ్లికన్ అసోసియేషన్ సంస్థను స్థాపించారు. అహింసా పద్ధతిలో బ్రిటీషువారు లొంగివస్తారన్న నమ్మకం వీరికి లేదు. 1925 ఆగష్టు 25న ప్రభుత్వ ధనంతో వస్తున్న రైలును కకోరి స్టేషనులో ఆపి లూటీ చేస్తారు. వీరిని పట్టుకుని నలుగురికి ఉరిశిక్ష, నలుగురికి ద్వీపాంతరవాసం, మిగిలినవారికి వేరువేరు శిక్షలు విధిస్తారు. కొంతకాలం అజ్ఞాతంగా వుండి, తరువాత విజృంభించి లాహోర్‌లో అసిస్టెంట్ పోలీస్ శాండర్సును హతమార్చుతారు. భగత్‌సింగ్, బందకేశ్వరదత్తులు, ఢిల్లీలోని సెంట్రల్ లెజిస్లేటివ్ ఛాంబర్లో బాంబు విసిరారు. తరువాత వైస్రాయి ప్రయాణిస్తున్న రైలుకింద బాంబుపేల్చారు. ఆల్‌ఫ్రెడ్‌పార్కులో ఒక మిత్రుని కొరకు ఎదురుచూస్తున్న చంద్రశేఖర ఆజాద్ ను చుట్టుముట్టి పోలీసు బలగాలు కాల్పులు జరుపుతారు. ఒక చెట్టు వెనుకనుండి కాల్పులు జరుపుతూ అజాద్ చాలా మంది పోలీసు అధికారులను గాయపరుస్తాడు. కాల్పులు జరుపుతూ ఆ ధీరుడు వీరమరణం పొందుతాడు. ఆల్‌ఫ్రెడ్ పార్కనగానే ఈ చరిత్ర అంతా కళ్లముందు నిలుస్తుంది.

★



ఆల్‌ఫ్రెడ్ పార్కు



క్రైమ్ కథ

అర్ధరాత్రి మిస్డ్‌కాల్

- యర్నాగుల సుధాకరరావు

రజనికి ఎంతసేపటికి నిద్రపట్టలేదు. ఎన్నడూలేనిది భర్త దినేష్ సాయంత్రం నుంచి మేడమీదగదిలో కూర్చుని ఎడతెరిపిలేకుండా సెల్‌లో ఎవరితోనో మాట్లాడుతూనే ఉన్నాడు. ఎవరితో ఏమి మాట్లాడుతున్నారని అడిగితే కస్సుమనడమే కాకుండా కొన్ని గంటలు నన్ను ఒంటరిగా వదిలేయ్ లేకుంటే పీక పిసికి చంపి పారేస్తాను అని గుఁయ్‌మన్నాడు. ఎన్నడూలేని విధంగా ఇలా ఎందుకంత కోపం చూపాడో అర్థంకాలేదు. అటు ఇటూ బెడ్‌మీద దొర్లింది. పక్కనే భర్త ఆదమరిచి నిద్రపోతున్నాడు. వాస్తవానికి అతడికి నిద్రపట్టకపోవాలి. అంత టెన్షన్‌లో ఉన్నాడు. కానీ, సెల్‌లో మాట్లాడుతూనే ఒకటి రెండుగంటల్లో ఫుల్‌బాటిల్ ఖాళీచేశాడు. మద్యం మత్తులో తెలివితప్పి పడున్నాడు. ఏదో జరిగింది. ఏమిటది? కొంపదీసి ఏదైనా పీకకు చుట్టుకున్న క్రైమా? లేకుంటే ఎదైనా లేడీ ఎఫైరా? ఎంతగానో ఆలోచించి నిద్రకు దూరమయ్యింది.

అప్పుడు అర్ధరాత్రి అవుతోంది. డిమ్‌లైట్‌లో గోడకున్న గడియారం చూసి పెద్దగా ఆవులించి నిద్రపోదామనుకుంటుండగా సెల్ మోగింది. మూడు రింగులు అయ్యాక ఆగిపోయింది. దినేష్‌కు తెలివిరాలేదు. కనీసం అతడు కదలలేదు. మళ్లీ రింగ్ అయ్యింది. అలా ఏకధాటిగా ఆరేడు సార్లు సెల్‌రింగ్ అవుతూనేఉంది. అప్పుడు లేచి టేబిల్ మీద ఉన్న సెల్ అందుకుని మిస్డ్‌కాల్సు వివరాలు చూసింది. ఒకే నెంబర్ నుంచి వచ్చిన కాల్సు. ఎవరా కొత్త నెంబర్? అని ఆలోచించింది. అంతలోనే మళ్లీ రింగ్ అయ్యింది. చెవికి అదుముకుంది.

"నువ్వు చెప్పినట్లే వర్మను వాడి ఇంట్లోనే చంపేశాను. నీపథకం భలేగా వర్కవుట్ అయ్యింది. వాడు ఇంట్లో ఒంటరిగానే ఉన్నాడు. నీఇంటి ముందున్నాను. నాకు ఇవ్వవల్సిన మిగిలిన పేమెంట్ ఇచ్చేయ్. ఈరాత్రి ట్రయిన్‌కు వెళ్లిపోతాను" అవతల అపరిచిత వ్యక్తి మాటలు విని తూలి పడబోయి తమాయించుకుంది. సెల్ ఆపేసి కుర్చీలో కూలబడింది. క్షణాల్లో చెమటలు పోశాయి.

"వర్మ హత్య చేయబడ్డాడా? అదీ దినేష్ చంపించాడా? చంపుకునేంత కక్షలు వీరిమధ్య ఏమున్నాయి? కలిసి వ్యాపారం చేస్తున్నారు. ఎప్పుడూ చిన్న పొరపొచ్చాలు కూడా వారిమధ్య లేవు. తనకు తెలిసినంత వరకు ఇద్దరూ బాగానే ఉన్నారు. వ్యాపారాలు చేస్తున్నారు. ఎందుకిలా చంపుకునే వరకు వెళ్లింది?" ఆలోచించి హంతకుడు తనింటిముందున్నాడు అని గుర్తుకువచ్చి వెంటనే లేచి చీకటిగదిలోంచి కిటకీ తెరిచి చూసింది.

కాలుకాలిన పిల్లిలా హంతకుడు తిరుగుతున్నాడు. పొడుగ్గా దృఢంగా కన్పించాడు. మరోసారి ఆమె గుండెలు దడదడలాడాయి. ఏం చేయాలి 'దినేష్‌ను లేపితే హంతకుడికి కిరాయి ఇచ్చి పంపేస్తాడు. వాడు ట్రయిన్ ఎక్కి ఎటో పారిపోతాడు. ఆతర్వాత హత్య తప్పకుండా దినేష్ పీకకు చుట్టుకుంటుంది' అని ఆలోచించి సెల్‌లో సమీప పోలీస్‌స్టేషన్‌కు రింగ్‌చేసి ఎవరో ఆగంతకుడు కత్తితో మాఇంటి వరండాలో నక్కి దాక్కున్నాడు అని తనింటి అడ్రసు చెప్పేసింది.

సైరన్‌తో పోలీస్‌వ్యాన్ వచ్చి సడన్‌గా ఇంటి ముందు ఆగింది. అప్పటికే ఒక మూల

"నువ్వు చెప్పినట్లే వర్మను వాడి ఇంట్లోనే చంపేశాను. నీపథకం భలేగా వర్కవుట్ అయ్యింది. వాడు ఇంట్లో ఒంటరిగానే ఉన్నాడు. నీఇంటి ముందున్నాను. నాకు ఇవ్వవల్సిన మిగిలిన పేమెంట్ ఇచ్చేయ్. ఈరాత్రి ట్రయిన్‌కు వెళ్లిపోతాను"

నక్కిదాక్కున్నాడు హంతకుడు. పోలీసులు పట్టేసుకున్నారు. అతడు ముందు పారిపోవాలనుకున్నా కుదరలేదు. తలుపు తెరుచుకుని వచ్చిన రజని 'ఇతడెవరో ఫోన్‌లో హత్య చేశాను మీఇంటి ముందున్నాను' అని ఏవేవో వాగుతున్నాడు అని పోలీసులకు చెప్పింది. హంతకుడు గుటకలు మింగుతూ తలపట్టుకున్నాడు. పోలీసులు హంతకుణ్ణి వ్యాన్ ఎక్కించుకుని తీసుకుని పోయారు.

రజని తిరిగి బెడ్‌మీదకు చేరినా ఆమెకు నిద్రపట్టలేదు. భయ భ్రాంతయి పోయింది. తెల్లారేవరకు ఆమె కళ్లు అలానే ఉండిపోయాయి. దినేష్‌లేచి తల విదలించేసుకుని సెల్ అందుకుని మిస్డ్ కాల్సు చూశాడు. వెంటనే రింగ్‌చేశాడు. "ఎక్కడున్నావు భిల్లా అనుకున్నట్టే అయ్యిందా! వర్మ చరిత్ర ముగిసిందా?' అని ఆత్రంగా అడిగాడు.

అవతలవైపునుంచి ఇన్‌స్పెక్టర్ గొంతు ఖంగుమంది. "మిస్టర్ దినేష్! వ్యాపారంలో వర్మకు నీకు గొడవలు లేవని వర్మ భార్య చెప్పింది. కానీ, నీవు అతడికి ఇవ్వవల్సింది లక్షల్లో ఉంది. అదీ నోటిమాటగానే ఉన్నందున నీవు అతడిని భిల్లా అనే కిరాయిహంతకుడిచే హత్య చేయించావు. కేవలం డబ్బు కోసం మిత్రుణ్ణి చంపించే నీచానికి దిగజారావు. వర్మ భార్య ఊళ్లో ఏదో పెళ్లికి వెళ్లి వచ్చేలోపు హత్య చేయించావు. నీవు పారి పోవడానికి ప్రయత్నించకు. నీఇంటిచుట్టు పోలీసులున్నారు. అర్ధరాత్రి భిల్లాను పట్టుకున్నాం. ఆక్షణం నుంచే ఇంటరాగేషన్ జరిపాం. ఉదయానికి నీవు నిద్రలేచేసరికి నీచేతులకు సంకెళ్లు వేసేందుకు అంతా సిద్ధమయ్యింది."

ఆమాటలకు ఠారెత్తిపోయాడు. పక్కనే భయం కారణంగా జ్వరం తెచ్చుకున్న భార్యను చూసి కంగుతిన్నాడు.

"వర్మను ఎందుకు చంపించావు? అతడు మనకు మంచి స్నేహితుడే. నేను ఎలా ఆఫ్యామిలీ ముఖం చూసేది" నీరసంగా అడిగింది.

"వర్మ మర్డర్ నీకు ఎలా తెలుసు? నేనే చంపించానని ఎలా చెబుతున్నావు?" ఆమె పక్కనే కూర్చుని అడిగాడు.

రాత్రి జరిగినదంతా చెప్పింది. అది విన్నాక పెద్ద షాకులోకి వెళ్లిపోయాడు. "ఏయ్ ఏంచేశావో నీకు తెలుసా? నీచేతులతో నీమొగుడుని ఉరికంబం ఎక్కిస్తున్నావు. నిన్ను ముందు చంపేయాలి" అని ఆమె గొంతు పట్టుకున్నాడు.

"ముందు నాప్రశ్నకు బదులిచ్చి చంపేయ్" అరిచింది.

"వర్మకు నాకు ఈమధ్య నలబైలక్షలు తేడా వచ్చాయి. ఆడబ్బు నావద్దనే ఉంది. ఆవిషయం నీకు ఇప్పుడే కదా తెలిసింది. అలాగే వర్మ భార్యకు కూడా వాడు చెప్పలేదు. కనుకనే వాడిని లేపేస్తే ఆ నలబై లక్షలు మనకి మిగులుతాయని ఈపనికి రెండు లక్షలు ఖర్చుచేసి వర్మను ఖూనీ చేయించాను"

"ఇలాగే ఏదో రోజు డబ్బుకోసం నన్ను చంపడానికి వెనుకాడవు కదూ! నీవంటివాడితో కాపురం పాము పడగనీడలో చేసినట్టే"

"నోర్ముయ్! నిన్ను రాత్రే చంపేసి ఉంటే నేను ఈరోజు పోలీసుల కళ్లల్లో పడకపోయే వాడిని. ఎంతపనిచేశావ్! అనవసరంగా భిల్లాను పోలీసులకు అప్పగించావు" అని తల పట్టుకున్నాడు.

బయట పోలీసుల బూట్ల చప్పుడుతో బాటు తలుపులు చప్పుడయింది.

★

ఫ్లైయింగ్ ఫాక్స్ అంటే ...

ఫ్లైయింగ్ ఫాక్స్ అంటే అదేదో ఎగురుతున్న నక్క అనుకొంటే పొరపాటే. ఎందుకంటే ఫ్లైయింగ్ ఫాక్స్ అనేది ఒక రకమైన గబ్బిలం. ఈ రకం గబ్బిలాల తలలు నక్కను పోలి వుంటుందన్న కారణంగా వీటికా పేరు వచ్చింది. చాలా రకాల గబ్బిలాలు చుంచులను పోలి వుంటాయి. కానీ ఫ్లైయింగ్ ఫాక్స్ రకం గబ్బిలాలు నక్కను పోలి వుండి చిన్న కుక్క పిల్లల సైజులో వుంటాయి. వీటి రెక్కల పొడవు దాదాపు 6 అడుగుల పైనే ఉంటాయి. వీటి అలవాట్లు ఇతర సాధారణ గబ్బిలాల మాదిరిగానే వుంటాయి. అయితే వీటికో వింత ఆహారపు అలవాటు వుంది. వీటికి పళ్ళు అంటే అమితమైన ఇష్టం. ఈ కారణంగా ఇవి పండ్ల తోటలకు గొప్ప ఉపద్రవంగా పరిణమించాయి. ఈ ఫ్లైయింగ్ ఫాక్స్ రకం గబ్బిలాలు మలేషియాలోనూ, ఆసియా ఖండంలోని కొన్ని ప్రాంతాలలోనూ, పసిఫిక్ మహాసముద్రం, హిందూ మహాసముద్రంలోని ద్వీపాలలోనూ ఎక్కువగా కనిపిస్తాయి.



పే...ద్ద సీతాకోకచిలుకలు

సీతాకోకచిలుకల్లో అతి పెద్దవి న్యూగినియాలో వున్నాయి. వీటిని బర్డ్ వింగ్స్ అని పిలుస్తారు. వీటి రెక్కలు ఎంత పెద్దవిగా వుంటాయంటే యూరోపియన్ పరిశోధకులు వీటిని దూరాన్నుండి తుపాకులతో కాల్చుగలిగేవారు. న్యూగినియాలో ఎక్కువగా కన్పించే ఈ బర్డ్ వింగ్స్ రకం సీతాకోకచిలుకల్లో క్వీన్ అలెగ్జాండ్రాస్ బర్డ్ వింగ్ అనే ఆడ సీతాకోకచిలుక అతి పెద్దది. వీటి రెక్కల పొడవు 330 మిల్లీమీటర్లకు పైనే వుంటుంది. వీటితో పోల్చి చూస్తే మగ సీతాకోకచిలుకలు చాలా చిన్నవనే చెప్పవచ్చు. ఎందుకంటే వాటి రెక్కల పొడవు 240 మిల్లీ మీటర్లు మాత్రమే వుంటుంది.

తెలుసా!



వర్షాలకోసం కప్పలపెళ్ళిళ్ళు

వర్షాలు కురవకపోతే కప్పలను పట్టుకొని జాతరలు చేయడం మన పల్లెటూళ్లలో అక్కడక్కడా కనిపిస్తుంటుంది. అయితే బంగ్లాదేశ్ ఈ మూఢనమ్మకాన్ని మరింత ముందుకు తీసుకుపోయి వర్షాలకోసం ఏకంగా కప్పలకు పెళ్ళిళ్ళు చేస్తున్నారు. ముఖ్యంగా బంగ్లాదేశలోని రంగపూర్ ప్రాంతంలో ఇది మరింత ఎక్కువ. అక్కడిరైతులు తమ తమ మతాచారాల ప్రకారం కప్పలకు పెళ్ళిళ్ళు చేస్తుంటారు. అనంతరం శంఖాలు ఊదుతూ ఆ కప్పల జంటలను నీళ్ళగుంటలలోకి వదిలిపెడతారు.

ఒక్క న్యూజిలాండ్‌లోనూ, కొన్ని ద్వీపాలలో తప్ప లార్క్ పక్షులు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తాయి. ఈ లార్క్‌లను మనం భరతపక్షులనీ, భరద్వాజపక్షులనీ అంటుంటాం. వీటిలో ప్రపంచవ్యాప్తగా 75 రకాలున్నాయి. అందులో స్కైలార్‌లనబడే పెద్దవి ఎగురుతూ కూడా పాటలు పాడతాయి. ఇవి ఇంచుమించు ఐదునిముషాల సేపు ఆపకుండా పాటలు పాడగలవు. బుష్‌లార్క్‌లనబడే చాలా తక్కువ సేపు పాడతాయి. బుష్‌లార్క్‌లలో మగ పక్షులు గాలిలో ఎగురుతూ పాటలు పాడుతూనే విన్యాసాలు చేస్తాయి.

పాటల పక్షులు

కూల్‌కూల్‌గా...



వేసవి తాపం తగ్గించే సహజ రసాలు

వేసవిలో అత్యంత సాధారణంగా కనిపించేవి కొబ్బరి బొండాలు, తాటి ముంజలు, చెరుకు రసాలు. ఇవి కూడా దాహాన్ని తీర్చి ఎండవేడి నుండి సేద దీర్చేవే. సహజమైన ఈ పదార్థాలు నిజంగా ప్రకృతి మానవులకి ఇచ్చిన వరాలే.

- డా॥ విజయ్

ప్రకృతిలో కొబ్బరి బోండాలూ, చెరుకు గడలూ, ముంజలు ఎప్పటి నుండో వున్నాయి. కాకపోతే వాటిని తినడమెలాగో మొదట తెలీదు. కానీ మానవుడే వాటిని ఎలాగోలా వుపయోగించవచ్చని గ్రహించాడు. ఇంక ఆ తరువాత వాటిని తనే పెంచడం, తనకోసం సాగు చేయడం ఆరంభించాడు. ఆ క్రమంలో ఒక్కో రకానికి ఎన్నో కొత్త జాతులను రూపొందించాడు. విశేషమేమిటంటే, మానవుడి తపనలో 'అసలు' రకం చాలా సందర్భాలలో కనుమరుగైపోయింది.

లేకపోతే, ఏదో గడ్డిజాతి నుండి ధాన్యాలను పెంచుకుని తినవచ్చనే కాకుండా, అదే గడ్డి జాతి మొక్క కాండాన్ని పిండి రసం తాగడం మంచిదని మనిషికి ఎలా తట్టిందో! ఏ మాత్రం కొరుకుడు, పడని కొబ్బరికాయని, తాటి కాయని కూడా కొట్టి , లోపలి విషయాన్ని సంగ్రహించడం ఎలా అబ్బిందో!

ముంజలండీ ముంజలు

చాలా మందికి తెలిసినవి, కానీ చాలా మంది ఇంకా రుచి చూడనివి తాటి ముంజలు. మన దేశంలోకి వచ్చిన తొలి రోజుల్లో బ్రిటిషు వారు తాటి ముంజల్ని చూసి వాటికి ఐస్ ఆపిల్ అని పేరు పెట్టారు. నల్లతాటి కాయలు లోపల మూడు మంచు గిన్నెలు, వాటిలోని తియ్యని నీళ్ల –వేలితో తోడి తింటుంటే ఆ రుచి, అనుభవమే వేరు. పట్టణాలలో ఈ మధ్య అక్కడక్కడ కాయల నుండి ముంజల్ని వేరు చేసి అమ్ముతున్నారు. ఈ ముంజలు నిజానికి తాటి 'గింజలు'. వాటిని ముదరనిస్తే, ముంజలే రాబోయే మొక్కకి ఆహారం అవుతాయి. ఆ గింజని పాతితే మొలకెత్తుతుంది. అలా మొలకెత్తే దశలో తవ్వి తీస్తే 'తేగలు' వస్తాయి. వీటినీ చాలా ఇష్టంగా తింటారు చాలామంది. ఇవన్నీ పట్నవాసులకి కొత్తగానూ, వింతగానూ వుండొచ్చు. కానీ పిల్లల్ని ఎప్పుడైనా పల్లెటూళ్ళకి తీసుకెళ్లి తాడి చెట్లని, వాటి కాయల్ని పరిచయం చేయాలి. ముఖ్యంగా ముంజల్ని తినడం నేర్పించాలి.

వేసవిలో ముంజలు చాలా మంచి చేస్తాయి. కానీ మనం (పట్నవాసులం) వాటిని, వాటి సద్గుణాలను మన శరీరానికి ఉపయుక్తంగా మార్చేంతగా ముంజల్ని తినే అవకాశం లేదు. కానీ వాటిని రోజూ తింటే వేసవిని ఇట్టే తీసేస్తాయి. కానీ ఏం చేస్తాం. కొన్ని అద్భుతాలు కొందరికి లభ్యం కావని సరిపెట్టోకోవలసిందే.

లేత కొబ్బరి నీళ్లు

ఇక సర్వత్రా లభించేవి లేత కొబ్బరి బొండాలు. ఇవి కూడా మొక్కల కోసం





ఉద్దేశించిన ఆహారమే. కానీ అప్పటికప్పుడు చెట్టు నుండి దించిన బొండాం నీళ్లు నులివెచ్చగా, కాస్త తీయగా, కాస్త ఉప్పగా మొత్తానికి గొప్పగా వుంటాయన్నది అందరి అభిప్రాయం. ఆరోగ్యానికి హానిచేసే 'కూల్ డ్రింకులన్నిటికంటే అత్యంత శ్రేష్టమైనది. కొబ్బరి బొండాం. ఒక జన్మించే మొక్కకు కావలసిన పోషక పదార్థాలన్ని అందులో వుంటాయి. కాబట్టి మనకి అవి ఎంత మేలు చేస్తాయో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ వేసవిలో కొబ్బరి బొండాల్ని వదలకండి. ఎక్కువ ఖరీదు కూడా! కాని బొండాలు జ్వరం వచ్చిన వాళ్ళకీ, వడదెబ్బ తగిలిన వాళ్ళకీ, డయేరియా, నీరసం వున్న వాళ్ళకి మాత్రమే కాదు మాములు వాళ్లు అవి తాగితే పైన చెప్పిన అవస్థలు రాకుండా తప్పించుకోవచ్చు!

కొబ్బరి నీళ్ళు (లేత కొబ్బరి నీళ్ళు) శరీరానికి చలువ చేయడమే కాక జీర్ణకోశ సంబంధ సమస్యలను తగ్గిస్తాయి. మూత్రనాళ సంబంధ సమస్యలని తీసివేస్తాయి. కొలెస్ట్రాల్‌ని నియంత్రిస్తాయి. సాధారణంగా ఒక మంచి సైజు బొండాంలో దాదాపు 200 మిల్లీ లీటర్ల నీరుంటుంది. మన దేశవాళీ బొండాల నీళ్ళు కాస్త ఉప్పగా అనిపిస్తాయి. కానీ బ్రెజిల్ దేశపు కొబ్బరి బొండాలు మాత్రం బహు తీయగా వుంటాయి.

స్వచ్ఛమైన, కల్తీ లేని, కల్తీకి వీలు లేని, సహజసిద్ధమైన ఖనిజ పోషకాలు సమృద్ధిగా వుండే కొబ్బరినీళ్లు ఎండాకాలంలో అత్యంత శ్రేష్ఠం– కానీ ఏ కాలంలో అయినా అవి ఆస్వాదించదగ్గవే.

కొబ్బరికాయలు బహుశా మలేసియా కానీ ఇండోనేషియాలోగానీ పుట్టివుండవచ్చు. కానీ చాలా మంది దక్షిణాఫ్రికాలో జన్మించిందని అంటారు. ఆరవ శతాబ్దిలో అరబ్బు వర్తకులు తూర్పు ఆఫ్రికా నుండి ఈజిప్టుకు కొబ్బరి కాయను తీసుకుపోయారు. ఏడు వందల సంవత్సరాల తరువాత కొబ్బరికాయల్ని భారతదేశంలో చూసిన మార్కోపోలో వాటిని 'ఫరో కాయలు' అని పేరు పెట్టాడు. బహుశా అతనికి అవి ఈజిప్టు నుండి వచ్చాయని తెలుసేమో. కానీ 15వ శతాబ్దంలో పోర్చుగీసు వాళ్లు హిందూ మహాసముద్ర తీరం వెంబడి భారతదేశంలో కొబ్బరిచెట్లను చూసి వాటికి కోకోనట్ అనే పేరు పెట్టారు. కొబ్బరి కాయపై మూడు చిన్న గుంతలుంటాయి. వాటివల్ల పోర్చుగీసు వారికి కొబ్బరి కాయలు 'కోతి ముఖం' లో కనిపించాయి. ఆ కోతిముఖాన్ని కోకో అంటారు.

❋ కొబ్బరి నీళ్లు సహజమైన ద్రవం. దానితో తక్కువ చక్కెర పదార్థాలుండటమే కాకుండా తక్కువ పిండిపదార్థాలూ, వుంటాయి. కొవ్వు కూడా వుండదు.

❋ కొలెస్ట్రాల్ లేకపోవడం వల్ల పాల కంటే కూడా పుష్టికరమైనది

❋ తక్కువ క్యాలరీలుండటం వల్ల ఇతర పండ్ల రసాలకంటే శ్రేష్ఠం.

❋ తల్లిపాలలో వుండే 'లారిక్ ఆమ్లం కొబ్బరి నీళ్లలో లభిస్తుంది. ఈ ఆమ్లం బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్‌లకు వ్యతిరేకంగా పని చేస్తుంది. వ్యాధి నిరోధకతను పెంచుతుంది.

❋ మానవ రక్తంలోని ప్లాస్మాను పోలి వుండటం వల్ల కొబ్బరినీటిని శరీరంలోకి ఎక్కించి ప్రాణాల్ని కాపాడిన ఉదంతాలూ వున్నాయి.

❋ కొబ్బరి నీళ్లలో ఎక్కువ పొటాషియం (294 మిగ్రా), తక్కువ సోడియం (25 మిగ్రా) వున్నాయి. తక్కువ సహజ చక్కెరలు 95 మిగ్రా), ఎక్కువ క్లోరైట్లు (118 మిగ్రా) వున్నాయి.

తియ్యటి చెరుకు రసం

వేసవిలో ఎక్కడ బడితే అక్కడ చెరుకు రసం బళ్లు దర్శనమిస్తాయి. అప్పుడే చెరుకుగడలను పిండి వచ్చిన రసాన్ని వడగట్టి, కాస్త అల్లం, నిమ్మకాయ జోడించి తాగితే మిట్టమధ్యాహ్నపు ఎండలో ఎన్ని గ్లాసుల రసమైనా సర్రున జుర్రెయ్యవచ్చు. చెరుకు రసం నీరసాన్ని తగ్గిస్తుంది, సేద తీరుస్తుంది. దానిలోని అధిక కార్బోహైడ్రేట్ల కారణంగా శక్తినిస్తుంది. చెరుకు రసాన్ని డయాబెటిక్ వున్న వాళ్లు కూడా నిస్సంకోచంగా తాగవచ్చు.

సాధారణంగా రసం ద్వారా ఇబ్బంది కలగకపోవచ్చు గానీ, రసం తీసే పద్ధతులు, ఆ పరిసరాల వల్ల కొన్ని సమస్యలు రావచ్చు. రసం తీసేవాళ్లు, రసం తీసే యంత్రం శుభ్రంగా వుండక పోవచ్చు. గ్లాసులు, ఐసు కూడా! ఇక చెరుకు పిప్పి ఈగల్ని, బ్యాక్టీరియాని ఇట్టే ఆకర్షిస్తుంది. ఇవన్నీ దృష్టిలో వుంచుకుని చెరుకు రాసాన్ని సేవించాలి. రెండు మూడు గ్లాసులు తాగిన తరువాత కాస్త మత్తుగా ఉంటుంది. అయితే అదే పనిగా అధికంగానూ, రోజూ చెరుకు రసాన్ని తాగడం అంత మంచిది కాదు. కానీ ఎండ వేడి నుండి సేద తీరాలంటే చెరుకు రసం ఉత్తమం.

★

కొత్త పుస్తకాలు

తెల్లోడిపై తొలి పోరు



ఈ చారిత్రక నవల "నవ్య" వార పత్రికలో సీరియల్‌గా (2006-07) ప్రచురింపబడింది. అమెరికాలోని చికాగో నుంచి వెలువడుతున్న "తెలుగునాడి" మాస పత్రికలోనూ (2008) ఈ నవల ప్రచురించబడింది. ఈ గ్రంథాన్ని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వారి ఆర్థిక సహకారంతో కవి ప్రచురించారు. సుప్రసిద్ధ చిత్రకారులు 'శ్రీచిదంబరం' గారికి అంకితం చేసిన ఈ నవల... తెల్లవారిపై తెలుగునాట తొలి పోరాట చరిత్ర లిఖించబడింది. తెరిణెకంటి గ్రామస్థుల పోరు భారతదేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. పదునైన సంభాషణలతో పన్నెండు అధ్యాయాలతో ఈ ముట్టడి పాఠకుల్ని ఏకబిగువున చదివిస్తుంది. "గ్రామస్థులారా! కుంఫిణీ సైన్యాధికారి విలయం ధాక్రే దండుగా మన గ్రామంపై ముట్టడి చేయడానికి వస్తున్నాడు. వారికి లొంగి వుండి శిస్తు కట్టాలో, ఎదురు తిరిగి పోరాడాలో మీరే నిర్ణయించండి"

"లొంగి వుండడం అన్నది మన గ్రామ చరిత్రలోనే లేదు. పోరు సాగించి మన శౌర్యమేమిటో ఆ తెల్లకుక్కలకు రుచి చూపిద్దాం"

"ఐ యామ్ ది గవర్నర్- యు ఆర్ ఓన్లీ ఎ ప్రిన్స్‌పల్ కలెక్టర్. డోంట్ ఆర్గ్యూ విత్ మి. యూ మస్ట్ బి ఒబే మై ఆర్డర్" కోపంగా చెప్పాడు రమ్‌బోల్డ్ (పేజీ45) లాంటి సంభాషణలు మనల్ని చదివింప చేస్తాయి.

చరిత్ర అంటే రాజుల శౌర్యాలు, శృంగార విలాసాలు, గొప్ప గొప్ప భవంతులు, కట్టడాలు కాదు... చరిత్ర అంటే పాలకుల విశేషాలే కాదు, భుక్తి కోసం, భూమికోసం, దాస్య విముక్తికోసం జరిపిన ప్రజా పోరాటాలు వున్నాయి. ఆ పోరాటాలు అధ్యయనం చేసే వ్యక్తిగా సమాజం పట్ల, ప్రజల పట్ల, సామాన్యుల పట్ల మన బాధ్యతా కర్తవ్యాలు తెలుస్తాయి. యువతరం చరిత్రను అన్ని కోణాలనుండి అధ్యయనం చేయాలి. రాజులు, రాణుల ప్రేమ పురాణాలే గాక, రాళ్లెత్తిన కూలీలను అధ్యయనం చేయాలి. సామాజిక అవగాహన లేని వ్యక్తి శాస్త్రవేత్త అయినా సామాన్యుడితో సమానమే అన్న 'అజీజ్' అభిప్రాయాల్ని అంగీకరిస్తూ ఈ 'ముట్టడి'ని అభినందిస్తూ....

- తంగిరాల చక్రవర్తి

తెరిణెకంటి ముట్టడి
రచన: యస్. డి.వి. అజీజ్
పేజీలు : 80, వెల: 50/-,
ప్రతులకు: యస్.డి.వి. అజీజ్,
46/634 బుధవార పేట, కర్నూలు 518002.

విషాదమూర్తి సృష్టికర్త జాన్ ఫెర్నాండెజ్ చిత్రాన్ని కవర్ పేజీలో (లోపలి పేజీల్లోనూ) ముద్రించి ఓ ప్రత్యేక కవితా సంపుటిగా చైతన్య ప్రకాష్ ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దారు. కవి తన అమ్మమ్మ బిల్లం లింగమ్మ స్మృతికి అంకితంగా ఈ గ్రంథాన్ని వెలువరించారు.

అమ్మను చక్కగా అవగాహన చేసుకున్న చైతన్య ప్రకాష్ తొలి కవితలో చక్కగా అవగాహన చేస్తూ అక్షర నివాళి ఇచ్చారు. "తెరుచుకున్న హృదయం" అంటూ ప్రముఖ విప్లవ కవి 'వరవరరావు' చక్కటి ముందుమాట రాశారు. ఈ దర్వాజాలోకి చూస్తే ఇంక నిద్ర పట్టదు. నీ కనురెప్పలూ మూసుకోవు. ఆ దర్వాజా మూసుకోదు. ఆ దర్వాజానే నీ కనురెప్పలేమో. ఆ దర్వాజానే నీ గుండె తలుపులేమో? అది శ్రమ జీవుల దుఃఖ చరిత్ర. తిరగబడ్డ ప్రజల పోరాట గాథలూ, అవ్వా నాన్నా కోల్పోయిన కొడుకుల కూతుళ్ల తొవ్వలు కనిపించే దర్వాజాలు - ఆ దర్వాజాల వెనుక నుంచి కనిపించే కవి గానమే ఈ కవితా సంపుటి అంటూ వరవరరావు ప్రసంశించారు.

"నెత్తుటి వడపోత చైతన్య ప్రకాష్ కవిత" అంటూ నందిని సిద్ధారెడ్డి ప్రయోగాత్మకంగా కవితల్లోని కవితా లక్షణాలను విపులీకరించారు.

శ్రమ జీవుల దుఃఖ చరిత్రే

"మూయని దర్వాజా'

ఈ కవితా సంపుటిలో అద్భుతమైన తెలంగాణా మాండలీకం ఒక బలమైన శబ్ద ప్రయోగంగా ప్రత్యేకమైన పద జాలం - తెలంగాణా డిక్షన్ చూడగలం. ఉదాహరణకు చూడగలుగాలే / సోల్ను, దిమ్మిస, ఎగిర్తం, పజీత, అయిసతి, వినిపిస్తయి, అద్దుకోగలుగాలె లాంటి పదాలెన్నో ఆత్మీయంగా గుండె పొరల్ని స్పృశిస్తాయి. మూయని దర్వాజా లోపల దాదాపు 65 కవితలు, 130 దాకా వున్నాయి. "బావయ్యో! ఒక్కసారి చూసిపోవయ్యో" అనే పాటను గుర్తుకు తెస్తుంది 3వ పేజీ లోని "బావకు చెప్పు" కవిత.

"గిట్లనే... గీతూట్లు పడ్డ రాజ్యాన్ని...."

ఏలెత్తి చూపెట్టమని చెప్పు!'

తిప్పల బత్కులు వొయ్యేదాకా/అప్పుల బత్కులు లేకుండేదాకా... లేపిన తుపాకీ దించకుమని చెప్పు

అలాగే ఎంతో అర్థవంతమైన "విశ్వ రహస్యం" కవితలో కవి చివర్లో ఇలా అంటాడు - "జీవితం ఒక గొప్ప తపోవనం/ స్పందించాలే కానీ... రెండు చేతులే విశ్వం - ధారాపాతమవుతున్న నయనం (పేజీ83) తెలంగాణా సోయిలో ప్రచురితైన అల్గం కవితలో (పేజీ86) కవి భావాలు ఎంతో అద్భుతమైన పదాలతో మనసున్న వార్ని కంట తడి పెట్టిస్తాయి..." తాయికోసం తండ్లాట, కానట్టు అయినట్టు, మరో దర్వాజా తెరిచాను, శ్రమ జీవుల దుఃఖ చరిత్ర, తిరగబడ్డ వీరుల పోరాట గాథలూ, కవి కన్పడకుండానే గానం వినపడ్తుంది. అవ్వా నాయినా, కోల్పోయిన కొడుకుల తొవ్వలు, ఇక దర్వాజా మూయలేకపోయాను (పేజీ89)... ఇలా ఎన్నో కవితలు మనల్ని ఆలోచింపచేస్తాయి.

- టి.సి



అక్షర సత్యం
ఎం.సి. దాస్
వెల : 30/-,
పేజీలు : 56.
ప్రతులకు :
అన్ని పుస్తక షాపులు.



మూయని దర్వాజా
(కవితా సంపుటి)
రచన: చైతన్య ప్రకాష్
పేజీలు : 135,
వెల: 60/-,
ప్రతులకు:
అన్ని ముఖ్య పుస్తక విక్రయశాలల్లో

ట్రక్కు కావాల్సిందే!

ఈ ఫోటోలు చూశాక మతి పోయిందా! సేమ్ టు సేమ్ మా పరిస్థితీ అదే. ఓ ట్రక్కులో తీసుకెళ్లాల్సిన వాటిని ద్విచక్ర వాహనాల మీదే లాగించాలని చూస్తున్నారే!

పొదుపనుకోవాలా!

పిసినారితనం అనుకోవాలా?

పేదరికమనుకోవాలా!!

దొంగ త్యాగం



జరిగినకథ:

రాజుగారి కుమారుడు, మంత్రిగారి కుమారుడు, వ్యాపారి కొడుకు మంచి స్నేహితులు. ఎక్కడికి వెళ్లినా కలిసే వెళ్లేవారు. వారికి చదువు అస్సలు అబ్బలేదు. పైగా ఎటువంటి పనీ నేర్చుకోవాలనుకునేవారుకాదు. ఈ విషయం తెల్సిన రాజు, మంత్రి, వ్యాపారి ...పిల్లలను పిలిపిస్తారు. మార్గం మార్చుకోమంటారు. కాని వక్షంలో ఇంట్లోంచి పంపేస్తానంటాడు వ్యాపారి. ఇంట్లోంచి వెళ్లిపోయి ఎలాగైనా డబ్బు సంపాదించాలనుకుంటారు ముగ్గురూ. దూరాన వున్న పర్వతశిఖరాన విలువైన వజ్రాలు, మణులు వున్నాయని చెప్పకోవడం విన్నానంటాడు వ్యాపారి కొడుకు. ముగ్గురూ కష్టపడి అక్కడికి చేరుకుంటారు. వజ్రాలు సంపాదిస్తారు. అయితే దారిదొంగల విషయం గుర్తొస్తుంది. ఆ తర్వాత....

(రెండవ భాగం)

"దొంగలు మనల్ని చంపి అత్యంత విలువైన వజ్రాలను తీసుకెళ్లినా ఆశ్చర్యంలేదు' అంటాడు వ్యాపారి కొడుకు.

రాజు కొడుకు కూడా అవునన్నట్టు తల ఊపి "వజ్రాలను చెక్కు చెదరకుండా ఇంటికి తీసుకెళ్లే మార్గం ఆలోచించాలి" అంటాడు.

"నాకు ఏం చేయాలో తెల్సు. ఏం చేయాలంటే... అడవిలోకి ప్రవేశించే ముందు మనం ఆ వజ్రాలను మింగేద్దాం. చక్కగా వాటిని ఇంటికి తీసుకెళ్లొచ్చు...ఏమంటారు" అంటాడు మంత్రి కుమారుడు.

"ఆ... అదే మంచి వాపాయం. వజ్రాలు అక్కడ వున్నట్టు ఎవరూ కనిపెట్టలేరు" అంటాడు రాజు కుమారుడు మెచ్చుకోలుగా.

అలా నడుచుకుంటూ నడుచుకుంటూ అడవి దగ్గరకు చేరుకుంటారు. అప్పడు ఒక చెట్టు నీడన కూర్చుని తమ వెంట తెచ్చుకున్న మూటలు విప్పతారు. నోటి నిండా ఆహారం పెట్టుకుని దాంతో పాటు వజ్రం కూడా మింగేస్తారు. ముగ్గురు స్నేహితులూ ఇదే విధంగా చేస్తారు. చాలా సంతోషంగా అడవి దాటాలని నిర్ణయించుకుంటారు.

అయితే ఇదంతా చెట్టు చాటు నుంచి ఒక దొంగ చూస్తాడు. వారు మాట్లాడుకున్నదంతా వింటాడు. వాడికి ఒక ఆలోచన వస్తుంది. కష్టపడకుండా మూడు వజ్రాలను సంపాదించాలంటే...ఒకటే మార్గమనుకుంటాడు. ఆ ముగ్గురు స్నేహితులను చంపేసి వాటిని సొంతం చేసుకోవాలనుకుంటాడు.

ముగ్గురు స్నేహితులూ అడవిలోకి వెళ్లడానికి సిద్ధపడుతుండగా... దొంగ కూడా వారితో చేరతాడు.

"నమస్తే అండీ. ఈదారిన కూసింత ముందుకు వెళ్లామంటే... చిక్కటి అడవి ఎదురవుతుంది. నేను ఈ అడవి దాటాలి. కానీ నాకు ఒంటరిగా వెళ్లాలంటే భయం. నేనూ మీ వెంట వస్తాను. అనుమతిస్తారా?!' అని అడుగుతాడు ఎంతో వినయంగా, స్నేహంగా.

తమ బృందంలో మరొకరు చేరుతున్నందుకు వారు ఎంతగానో సంతోషిస్తారు. ఆహ్వానిస్తారు.

తను దొంగనన్న విషయం ముగ్గురు మిత్రులకు ఏమాత్రం తెలియకుండా చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తుంటాడు. వారు మాత్రం అతడిని కూడా తమలో ఒకడిగా చూసుకుంటారు. తమ వెంట వున్న ఆహార పదార్థాలను అతడికి కూడా పెడుతుంటారు. అలా... చక్కగా కబుర్లతో ప్రయాణం హుషారుగా సాగుతుంటుంది. అలా అడవి మధ్యలోకి వచ్చాక వారికో గ్రామం కనిపిస్తుంది.

ఆగ్రామ పెద్ద ఇంటి మీదగా నడుస్తుంటారు నలుగురూ. గ్రామ పెద్ద దగ్గర ఒక చిలుక వుంది. అది ముందు వరండాలోనే వుంటుంది.

వారలా వెళుతుండగా...."ఈ ప్రయాణికుల దగ్గర వజ్రాలున్నాయి "...."ఈ ప్రయాణికుల దగ్గర వజ్రాలున్నాయి..." అంటుంది ముద్దు ముద్దుగా. ఆ మాటలు వింటాడు గ్రామపెద్ద. వెంటనే ఆలోచించి వాటిని ఎలాగైనా తన సొంతం చేసుకోవాలనుకుంటాడు.

"కానీ ఎలాగో అతనికి అర్థంకాదు. అదంతా తర్వాత ఆలోచిద్దాం. ముందు వారిని పిలిపిద్దాం" అనుకుని మనుషులను పంపుతాడు.

(ఇంతకీ నలుగురూ గ్రామ పెద్ద దగ్గరకు వెళతారా? వెళితే...వారి దగ్గరనుంచి వజ్రాలను సంపాదిస్తాడా? అసలు వజ్రాలు వారి పొట్టలో వున్నట్టు అతడు తెల్సుకుంటాడా? ఏమైందనేది తెలియాలంటే ఏడు రోజులు ఆగాల్సిందే.)

- చూటీ